Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 30.11.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 26 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## ప్రతిభావంతుడికి...
# ప్రతిష్టాత్మక అవార్డు



## భారతదేశంలోనే అత్యుత్తమ వినోద కేంద్రంగా 'మాయాజాల్'కి గుర్తింపు తెచ్చిన నెల్లూరీయుడు
# బోగొల్లు ఉదీప్‌రెడ్డి

తనకంటూ ఓ వొరవడితో నిత్యం నూతనత్వాన్ని ఆవిష్కరించడంలో గుర్తింపు తెచ్చుకున్న ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ మోహన్ అసోసియేట్స్ సారధి బోగొల్లు మోహన్‌రెడ్డి ఇప్పుడు వినోద రంగంలో కూడా తన ప్రతిభను చాటుకుని మరో చరిత్ర సృష్టిస్తున్నాడు. తన కుమారుడు ఉదీప్‌రెడ్డి సారధ్యంలో చెన్నైలో నడుస్తున్న 'మాయాజాల్' మల్టీప్లెక్స్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది భారతదేశంలోనే అత్యుత్తమ మల్టీప్లెక్స్‌గా జాతీయ స్థాయి అవార్డు సాధించేలా తయారు చేశాడు. సంస్థ నిర్వహణలో కొడుకుది కీలకపాత్ర అయితే మాయాజాల్‌లోని 16 స్క్రీన్‌లను ఒక దానితో ఒకటి పోటీ పడే విధంగా 16 విధాల ఇంటీరియర్ కాన్సెప్ట్‌లను తన చిన్నకుమారుడు సందీప్‌తో కలిసి అందించి జాతీయ స్థాయి వినోద రంగాన్ని

'మాయాజాల్' ముచ్చట్లు 8, 9 పేజీలలో...

(మిగతా 7వ పేజీలో)

# నిప్పుకు... సుజనా తుప్పు



- బాబు బినామీ భాగోతం బట్టబయలైంది
- ఈడి, ఐటి దాడులతో కదులుతున్న అవినీతి పునాదులు
- సిబిఐపై నిషేధం ముందుచూపుతోనేనా?

**కొద్దిరోజుల క్రితం రాష్ట్రంలోకి సిబిఐను నిషేధిస్తూ చంద్రబాబు ప్రభుత్వం జి.ఓ జారీ చేసింది. దీనిమీద పెద్ద రాద్ధాంతమే జరిగింది. జాతీయ మీడియా చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడితే ఆంధ్రప్రదేశ్ పచ్చమీడియా మాత్రం చంద్రబాబు సిబిఐ తోకను కత్తిరించారంటూ సిబిఐను కుక్కతో పోలుస్తూ కార్టూన్‌లు వేసి శునకానందం పొందింది.**

అయితే చంద్రబాబు సిబిఐ అంటే ఎందుకు వణికిపోతున్నాడో మొన్నటి ఆయన ప్రధాన అనుచరుడు, ఎంపి సుజనాచౌదరికి చెందిన కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ చేసిన దాడులతో తేటతెల్లమైంది. ఈడి చేసిన దాడులతోనే ఇంత అవినీతి భాగోతం బయటపడితే ఇక సిబిఐ రంగంలోకి దిగితే చంద్రబాబు సర్కార్ అవినీతి చిట్టా అంతా బయటకు తీయదా?

నిన్నటి సుజనాచౌదరి కంపెనీలపై ఈడీ దాడులతో నిప్పుగారి నిజాయితీకి తుప్పు పట్టినట్లయ్యింది. ఈ దాడులతో చంద్రబాబు బినామీ సుజనా అక్రమాలు బయటపడ్డాయి. 120కి పైగా బోగస్ కంపెనీలను నెలకొల్పిన ఆయన పలు బ్యాంకుల నుండి వాటి పేర్లతో 5700 కోట్లు అప్పులు తీసుకోవడం, అన్ని కంపెనీలకు ఒకే అడ్రస్ ఇవ్వడం, నిబంధనలకు విరుద్ధంగా నిధులను దారి మళ్ళించడం, తన కంపెనీ ఉద్యోగులనే డైరక్టర్లుగా పెట్టడం వంటి అక్రమాలెన్నో వెలుగు చూశాయి. వీటిపై ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ ఇంకా లోతుగా విచారణలోకి పోతోంది. సుజనాచౌదరి భాగోతం బయటపడ్డాక

(మిగతా 15వ పేజీలో)




2లో




## ఆంధ్రా రాజకీయాలలో...
# డైవర్షన్ అంకుల్స్



> ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చే కుట్ర

**తెలుగు టీవీ ఛానల్స్‌లో డైవర్షన్ ఆంటీ ఇంటర్వ్యూలను అందరూ చూసే వుంటారు. రానాకు రావాల్సిన మరణాన్ని రామానాయుడుకు డైవర్ట్ చేసానని, ఇండియాకు రావాల్సిన సునామీని ఇండోనేషియాకు మళ్లించానని, అమెరికాలో పేలాల్సిన బాంబులను ఆఫ్ఘనిస్థాన్‌లో పేలేలా చేసానని ఈ డైవర్షన్ ఆంటీ చెబుతుంటుంది. చూసేవాళ్ళకు కూడా అదో కామెడీగా వుంటుంది.**

ఈ డైవర్షన్ ఆంటీ లాగానే ఆంధ్రా రాజకీయాలలో డైవర్షన్ అంకుల్స్ కూడా తయారయ్యారు. వీళ్ళ పని చంద్రబాబు వ్యతిరేక ఓట్లను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి పోకుండా డైవర్ట్ చేయడం. ఇందుకోసం రాజకీయ తెరపైకి వచ్చిన ఆ డైవర్షన్ అంకుల్స్ పవన్ కళ్యాణ్, జె.పి.నారాయణ, జె.డి.లక్ష్మీనారాయణ.

2019 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ పాత్ర విభిన్నంగా వుండబోతోంది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు గెలుపుకు ఆయన సహకరించారు. కాని రేపటి ఎన్నికల్లో చంద్రబాబుకు ఓట్లేయమని చెప్పినా ఆయన

(మిగతా 15వ పేజీలో)

# తిరుగులేదు

## పిఎస్ఎల్వి-సి43 విజయవంతం



**నమ్మకానికి అమ్మలాంటిది పిఎస్ఎల్వి సిరీస్. నిజమే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు పిఎస్ఎల్వి అత్యంత నమ్మ కస్తురాలైంది. విశ్వాసంగా వుంటుంది. క్రమశిక్షణ కలిగి చెప్పిన పని చెప్పినట్లు చేసే గుడ్ స్టూడెంట్‌గా వుంది. కాబట్టే పిఎస్ఎల్వి ప్రయోగం అంటే ఇస్రో శాస్త్రవేత్తలకు ఎలాంటి టెన్షన్ ఉండడం లేదు.**

ఇస్రో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని పిఎస్ఎల్వి మరోసారి నిలబెట్టుకుంది. 29వ తేదీ గురువారం ఉదయం 9.58 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయో గించిన పిఎస్ఎల్వి-సి43 విజయవంతమైంది. మొత్తం నాలుగు దశలలో జరిగిన ఈ ప్రయోగం ద్వారా 31ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలలో ప్రవేశ పెట్టారు. మన దేశానికి చెందిన 380 కిలోల బరువు గల హైసిస్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. దేశ రక్షణ రంగానికి ఇది సేవలందిస్తుంది. అలాగే అమెరికాకు చెందిన ఫ్లోక్3, ఆర్ ఉపగ్రహాలు 16, గ్లోబల్-1, సిసిరో-8, లీమూర్ 4, హెచ్‌శాట్-1 ఉపగ్రహాలు మొత్తం 23 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టడం జరిగింది. ఇవి కాకుండా ఆస్ట్రేలియాకు చెందిన సెంట్యూరీ, కెన్యాకు చెందిన కేప్లర్, కొలంబియాకు చెందిన ప్యాక్, ఫిన్లాండ్‌కు చెందిన రియార్డర్ హాలో వరల్డ్, మలేషియాకు చెందిన ఇన్నోశాట్-2, నెదర్లాండ్‌కు చెందిన హిచేర్-1, స్పెయిన్‌కు చెందిన 3క్యాట్ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం ద్వారా ఇస్రో అంతరిక్ష వాణిజ్యంపై మరింత నమ్మక మేర్పడింది. ప్రపంచంలోని చాలా దేశాలు ఇక ముందు తమ ఉపగ్రహాల ప్రయోగాలకు ఇస్రోనే ఉత్తమ మార్గంగా ఎంచుకునే అవకాశాలున్నాయి.

# యుద్ధానికి సన్నద్ధమవుదాం!

## వైసిపి శ్రేణులలో ఉత్సాహం నింపిన ఎంపి విజయసాయిరెడ్డి




ఎన్నికలు వేగంగా సమీపిస్తున్న తరుణంలో జిల్లాల వారీగా కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు, ఉత్తేజంతో ముందుకు కదిలించేందుకు వైసిపి అధిష్ఠానం ప్రణాళికలను సిద్ధం చేసింది. 2014 ఎన్నికల వైఫల్యాలను విజయాలుగా మలచుకునే దిశగా, పార్టీ కేడర్‌ను సంఘటితం చేస్తూ ఎన్నికల యుద్ధానికి సన్నద్ధం చేస్తున్నారు.

ఈ పరంపరలో భాగంగానే ఈ నెల 28వ తేదీ నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం జరిగింది. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్య సభసభ్యులు వి.విజయసాయిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని క్షేత్రస్థాయిలో కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయాలని సూచించారు. ఇంకొద్ది నెలల్లోనే మనం సార్వత్రిక ఎన్నికల ముందుంటాం. ఈ ఎన్నికలు మనకు కీలకం. గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేయాలి. ప్రజాసమస్యల విషయంలో ప్రభుత్వంపై సమరం ముమ్మరం చెయ్యాలి. ఇకనుండి ప్రతిక్షణం, ప్రతి నిముషం మనకు విలువైనదే! ప్రతి నిముషం మనం ప్రజలముందే వుండాలి. అధికారపార్టీ చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజల ముందు ఎండగట్టాలి. ప్రతి నియోజకవర్గంలోనూ నూరుశాతం బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలి. పార్టీ అనుబంధ విభాగాలను సమన్వయం చేసుకోవాలి. ప్రజలకు జగన్ ప్రకటించిన నవరత్నాలను గురించి వివరించాలి. ఇక నుండి ప్రతిరోజూ కష్టపడితే 2019 గెలుపు మనదేనంటూ విజయసాయిరెడ్డి ఉపదేశించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావ్‌పూలే వర్ధంతిని పురస్కరించుకుని నాయకులందరూ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సమావేశానికి మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, పి.అనిల్ కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సమన్వయకర్తలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేరిగ మురళి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సి.ఇ.సి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కారు కన్నీరు పెట్టిస్తోంది..!



- పింఛన్ కోసం గీత కార్మికుడి వెతలు
- సమస్యను ఒకే కోణంలో చూస్తున్న అధికారులు

***అతను గీత కార్మికుడు... కాని అతని నుదుటి గీత బాగాలేనట్లుంది. రికార్డుల్లో తప్పుడు రాతల వల్ల అతని తలరాత మారిపోయింది. తనకు తెలియ కుండానే తన పేరుతో కారు రిజిస్ట్రేషన్ జరిగి వుండడంతో అతను కనీసం పింఛన్ పొందే అర్హత కూడా కోల్పోయాడు. అతనికే తెలియకుండా అతని పేరుతో రిజిస్టర్ కాబడ్డ కారు అతని కడుపు మీద కొడుతోంది. కన్నీరు పెట్టిస్తోంది.***

కొడవలూరు మండలం బ్రహ్మారెడ్డిపాలెంకు చెందిన కల్లుగీత కార్మికుడైన జాన శ్రీనివాసులు వయసు మీద పడడంతో కల్లుగీత వృత్తిని కొనసాగించే ఓపిక లేక బ్రతుకుదెరువు కోసం పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అతనికి పింఛన్ మంజూరయ్యే సమయంలో ఆన్‌లైన్‌లో అతని పేరుతో ఇసుజు కారు రిజిష్టర్ కాబడినట్లుగా గుర్తించారు. 2015 ఫిబ్రవరి 20వ తేదీన అతని పేరుతో కారు రిజిష్టర్ చేయబడి వుంది. మరి అతని గుర్తింపు కార్డులు, అతని సంతకం లేకుండా అతని పేరుతో కారు రిజిస్ట్రేషన్ చేసిన వాళ్లెవరన్నది భగవంతుడికే తెలియాలి.

నీకు కారుంది... పింఛన్ కావాలంటే కారు లేనట్లు సర్టిఫికేట్ తెచ్చుకోవాలని అధికారులు చెప్ప డంతో మొదట ఆర్టీవో ఆఫీసుకు వెళ్లాడు. అటెండర్ నుండి డిటిసి వరకు అందర్నీ కలిసాడు. అక్కడ నెలల కాలాలు తిప్పించుకున్నారు. పని జరగలేదు. ఎస్పీ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చాడు. వాళ్లు ఇది రవాణాశాఖకు సంబంధించిన పని అని చెప్పారు. కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే వాళ్లు కూడా రవాణాశాఖ ఆఫీసుకే పొమ్మన్నారు. చివరకు కొడవలూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా కూడా వాళ్ళూ ఆర్టీవో ఆఫీసుకే రెఫర్ చేశారు. ఇన్ని ఆఫీసుల చుట్టూ తిరిగినా, ఇంతమంది అధికారులను వేడుకున్నా చివరకు అతని పనైతే జరగలేదు.

జాన శ్రీనివాసులు గీతకార్మికుడు. చదువు సంధ్య పెద్దగా లేవు. మరి అతను తిరిగిన ఆఫీసర్లలో టెన్త్ నుండి ఐఏఎస్ వరకు చదివినవాళ్ళున్నారు. ప్రతి ఒక్కరూ అదొక పనిగా చూసారేగాని, అసలు అతని పేరుతో కారు ఎవరు రిజిష్టర్ చేశారు, ఆ కారు ఎవరు వాడుతున్నారన్నది తెలుసుకునే ప్రయత్నం చేశారా? అసలు జాన శ్రీనివాసులు పేరుతో రిజిష్టర్ ఎలా చేయగలిగారు? దానికి సంబంధించిన గుర్తింపు కార్డులు ఎలా ఇచ్చారు అనే దానిపై విచారణ చేయ గలిగారా? సంఘవిద్రోహులు, విదేశీ శక్తులు కూడా ఇలా నకిలీ పేర్లతో కార్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని తిరగొచ్చు... జాన శ్రీనివాసులుకు సంబంధం లేకుం డానే అతని పేరుతో కారు రిజిస్ట్రేషన్ చేయించుకుని తిరుగుతున్నారంటే ఖచ్చితంగా వాళ్ళు చట్టాలను ఉల్లంఘించిన వాళ్ళే!

అడ్డదారులు తొక్కే వాళ్లే అయ్యుంటారు కదా! ఏ కంపెనీ కారు, ఆ కారు నెంబర్ అన్నీ వుంటాయి కదా! ఆ కారును పట్టుకుంటే అన్ని వివరాలు తెలుస్తాయి కదా! ఇక్కడ సమస్యను కేవలం జాన శ్రీనివాసులు పింఛన్ కోణంలోనే కాదు, నకిలీ రిజి స్ట్రేషన్లు ఎలా జరుగుతున్నాయి, ఇలాంటివి ఇంకా ఎన్నివున్నాయి? అనే కోణంలో కూడా ఉన్నతాధి కారులు ఆలోచించాలి.

## ఆత్మబంధువే రాబందువయ్యాడు...

# పంతం పట్టి అంతం చేశాడు

### మహేంద్రసింగ్ హత్యకేసును ఛేదించిన పోలీసులు

డిసెంబర్ 3వ తేదీన నెల్లూరు, ఫత్తేఖాన్‌పేట వద్ద మెయిన్‌రోడ్డుపై జరిగిన కోమల్ పవర్‌టూల్స్ యజమాని రాజపురోహిత్ మహేంద్రసింగ్(40) హత్య కేసును నెల్లూరు పోలీసులు ఎట్టకేలకు ఛేధించారు. ఈ దారుణానికి ఒడిగట్టింది హతుడి అన్నకుమారుడేనని నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విక్రమ్‌సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.



ఈ కేసు పూర్వాపరాలలోకి వెళితే... రాజస్థాన్‌కు చెందిన మహేంద్రసింగ్ 15ఏళ్ల క్రితం బ్రతుకుదెరువు కోసం నెల్లూరుకొచ్చాడు. మొదట్లో టైల్స్ వ్యాపారం చేశాడు. తర్వాత ఫత్తేఖాన్‌పేట వద్ద కోమల్ పవర్ టూల్స్ షాపును పెట్టాడు. కొంతకాలం తర్వాత సంతపేటలోనూ ఒక షాపును పెట్టి దాని బాధ్యతను తన అన్న మంగీలాల్ కొడుకైన విక్రమ్‌సింగ్‌కు అప్పగించాడు. అతనికి పెళ్లి కూడా చేశాడు. అయితే విక్రమ్‌సింగ్ బుద్ది పెడదారి పట్టింది. షాపులో అవకతవకలకు పాల్పడే వాడు. ఇది గమనించిన మహేంద్రసింగ్ అతనిని షాపు నుండి వెళ్లగొట్టాడు. దాంతో చిన్నాన్నపైనే విక్రమ్‌సింగ్ ద్వేషం పెంచుకు న్నాడు. దీనికితోడు రాజస్థాన్‌లోని సొంత గ్రామంలో విక్రమ్‌సింగ్‌కు చిన్నాన్నతో ఆస్తుల గొడవలున్నాయి. ఈ క్రమంలోనే ఎలాగైనా చిన్నాన్నను అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. మహేంద్రసింగ్‌ను మట్టుబెట్టడం కోసం తన స్నేహితుడి ద్వారా ముంబైలో ఇద్దరు కిరాయి హంతకులను మాట్లాడుకున్నాడు. రాజస్థాన్‌లో తన బంధువులిద్దరిని మాట్లాడుకున్నాడు. మొత్తం 8లక్షలతో బేరం కుదుర్చుకున్నాడు. వాళ్ళ అకౌంట్లకు కొంత డబ్బు కూడా పంపించాడు. మహేంద్రసింగ్ వినాయకచవితికి రాజస్థాన్‌లోని సొంతూరికి వెళ్లినప్పుడు అక్కడే హతమార్చాలని చూసారు. కాని అక్కడ వీలుకాకపోవడంతో నెల్లూరు లోనే చంపాలని స్కెచ్ వేశారు. నెల్లూరులో మహేంద్ర సింగ్ దుకాణం వద్ద రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 3వ తేదీన మహేంద్రసింగ్ షాపు మూసేసి ఇంటికి పోతోతున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఆగంతకులు ఆయనపై మూడురౌండ్లు కాల్పులు జరిపి పరా రయ్యారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మహేంద్రసింగ్ మరణించాడు.

### సవాల్‌గా తీసుకున్న పోలీసులు...

ఎస్పీగా ఐశ్వర్యరస్తోగి బాధ్యతలు తీసుకున్న పక్కరోజే ఈ సంఘటన చోటు చేసుకుంది. నెల్లూరులో ఇలాంటి తుపాకీ కాల్పుల సంఘటనలు చాలా అరుదు. సంఘటన జరిగిన తీరును బట్టే ఇది స్థానికుల పనికాదని, ప్రొఫెషనల్ కిల్లర్స్ పని అయ్యుంటుందని పోలీసులు భావించారు. మహేంద్రసింగ్‌కు స్థానికంగా ఎవరితోనన్నా వివాదాలున్నాయా అనే దానిపై విచా రించారు. అలాంటివేమీ లేవని తేలడంతో పోలీసుల దృష్టి మహేంద్రసింగ్ సొంత గ్రామం మీదకు, అతని బంధువుల మీదకు మళ్లింది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న ఎస్పీ రస్తోగి చాలావేగంగా దర్యాప్తు జరి పించారు. రాజస్థాన్‌కు ప్రత్యేక బృందాలను పంపించారు. తీగలాగి చూస్తే మృతుడి సొంతూరులోనే డొంక కదిలింది. ఎంతో మిస్టరీగా వున్న కేసును నెల్లూరు పోలీసులు కేవలం 23రోజుల్లోనే ఛేధించి తమ పనితనాన్ని నిరూపించుకున్నారు.

## ఆకట్టుకుంటున్న..'ఫర్నిచర్ ఎక్స్‌పో'



నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కల్యాణమండపంలో ఈ నెల 29 నుంచి ప్రారంభమైన ఫర్నిచర్ ఎక్స్‌పో సింహపురీయులను కూడా బాగా ఆకట్టుకుంటోంది. ఈ ఫర్నిచర్ క్లియరెన్స్ సేల్స్ ఎగ్జిబిషన్ ద్వారా నాణ్యతగా ఉండే డైనింగ్ టేబుల్స్, డబుల్‌కాట్ మంచాలు, ఆఫీస్ ఫర్నిచర్, ఇళ్ళకు ఉపయోగపడే వస్తుసామగ్రిని సుమారు 50శాతం వరకు రాయితీతో ఇస్తున్నామని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు సురేష్‌రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ ఎగ్జిబిషన్ డిసెంబరు 5వ తేది వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రఖ్యాత రెయిన్‌బో చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఇప్పుడు చెన్నైలో..



## శుభస్వాగతం

భరతజాతికి ప్రియపాత్రుడు
నెల్లూరీయుల వరపుత్రుడు

మాటల ఘనాపాటి
కార్యసాధనలో మేటి

నేటి తరం ఆదర్శనేత
రేపటి తరానికి స్ఫూర్తిప్రదాత

ఆత్మీయతానురాగాల ఉషాపతి
మన భారతదేశ ఉపరాష్ట్రపతి

**శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు**

భారతదేశంలో 19సంవత్సరాలుగా చిన్నపిల్లల మరియు
మెటర్నిటీ విభాగంలో నూతన ఒరవడిని తీసుకొచ్చి
వైద్య రంగంలో అత్యుత్తమ ప్రమాణాలతో
అత్యున్నత స్థాయికి ఎదిగి అనేక జాతీయ అవార్డులతో పాటు
గిన్నిస్‌బుక్ రికార్డ్ సాధించిన మన నెల్లూరుజిల్లా,
చిరమన గ్రామ వాసి **డా॥ రమేష్ కంచర్ల** గారి
సారథ్యంలో ప్రగతిపథంలో నడుస్తున్న
**రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మరియు బర్త్‌రైట్**
హైదరాబాద్‌లో మొదలై విజయవాడ, బెంగుళూరు,
ఢిల్లీలలో 11శాఖలతో విజయవంతంగా సేవలందిస్తూ...
12వ శాఖను ఇప్పుడు చెన్నై మహానగరం నడిబొడ్డున
డిసెంబర్ 2, 2018 ఆదివారం ఉదయం 11.00 గంటలకు
ప్రారంభించనున్న ఆనంద తరుణంలో
ఇదే మా **శుభస్వాగతం**

BirthRight™
BY RAINBOW HOSPITALS
Your Right to a Safe Delivery.

Rainbow® Children's Hospital
It takes a lot to treat the little.

No. 157, Anna Salai, Near Little Mount Metro Station, Guindy, Chennai - 600015.

## 'ప్రభా'తం

# రామబాణమే శరణమా?

రామబాణం... ఈ అస్త్రానికి తిరుగుండదు. పురాణాలలో రామ బాణం విశిష్టత గురించి తెలుసుకున్నాం. అయితే పురాణాలలో అది రాముడికి ఎంతగా ఉపయోగపడిందో తెలియదుగాని, వర్తమాన భారత రాజకీయాలలో మాత్రం భారతీయ జనతా పార్టీకి ఎంతగానో ఉపయోగపడింది. రామబాణం అస్త్రం శక్తి ఎంతటిదో నేటి రాజకీయాలలో తేటతెల్లమైంది. కేవలం రెండే రెండు ఎంపీ సీట్లతో మొదలైన ఒక పార్టీని.. 278సీట్ల స్థాయికి తీసుకుపోయింది. అదీ రామనామం పవర్. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ భారత రాజకీయాలలో సెంటిమెంట్లు పెరుగుతుంటాయి. భావోద్రేకాలు వ్యక్త మవుతుంటాయి. కులాలు, మతాల వారీగా ప్రేమాభిమానాలు చోటుచేసుకుంటుంటాయి. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఇంకెంతో సమయం లేదు. గట్టిగా ఇంకో నాలుగు నెలల్లో దేశమంతా కూడా ఎన్నికల వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతుంటుంది. అయితే వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ అప్పుడే తన పాత బాణాన్ని బయటకు తీసింది. అదే అయోధ్య రామబాణం. బీజేపీ మళ్ళీ అయోధ్య అంశాన్ని తెరమీదకు తెస్తోంది. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన ముహూర్తం తేదీలు ఖరారు చేయాలని విహెచ్‌పి, ఆరెస్సెస్ వర్గాలు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయి. మరోపక్క ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ కూడా అయోధ్య విషయంలో ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఆయన లౌకికవాదం ముసుగును వాడుకోడం లేదు, డబుల్ డ్రామాలు వేయడం లేదు. మైనార్టీల ఓట్ల కోసం కపట ప్రేమలను కనపరచడం లేదు. తాను హిందూత్వవాదినని బహిరంగంగానే చెప్పుకుం టున్నాడు. అలహాబాద్‌ను ప్రయాగరాజ్‌గా, ఫైజాబాద్ జిల్లాను అయోధ్య జిల్లాగా మార్చి తన వైఖరిని స్పష్టం చేశాడు. అంతేకాదు, అయోధ్యలో ఏకంగా 221 అడుగుల శ్రీరామచంద్రుడి విగ్రహం నెలకొల్పడానికి శ్రీకారం చుట్టాడు. తాజాగా అయోధ్యలో లక్షల మంది రామభక్తులతో సదస్సు నిర్వహించారు. అయోధ్య కేసు సుప్రీం కోర్టులో నడుస్తోంది. ఈ వివాదంపై ఇంతవరకు తీర్పు రానప్పటికీ యూపీ సీఎం మాత్రం అయోధ్య రామమందిరం నిర్మాణం దిశగా ఒక్కో అడుగు ముందుకు వేసుకుపోతున్నాడు.

యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ అంటే... రేపు రామమందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేయాలన్నా అందుకు సిద్ధంగా ఉంటాడు. అతనికి పదవికంటే రామ మందిరం ముఖ్యం. దేనికైనా తెగిస్తాడు. మరి ఈ విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ వైఖరేంటి? ఇదే పెద్ద ప్రశ్న?

దీనిపై బీజేపీ వైఖరి ఏ విధంగా వుండబోతుందన్నది రేపు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను బట్టి ఉండబోతుంది. తెలంగాణలో బీజేపీకి అధికారం మీద ఆశలేదు. కాకపోతే అక్కడ కూటమి బదులు టిఆర్ఎస్ గెలవాలని కోరుకుంటారు. ఎందుకంటే తెలంగాణలో గాని, మిజోరాంలోగాని కాంగ్రెస్ ఓడిపోవడమే బీజేపీకి కావాలి. మరి బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఫలితాలపైనే ఆ పార్టీ భవిష్యత్ నిర్ణయాలు ఆధారపడి ఉంటాయి. రాజస్థాన్ ఫలితాన్ని కూడా పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే వరుసగా రెండోసారి ఏ పార్టీ కూడా అక్కడ అధికారంలోకి రాలేదు. వసుంధరా రాజెపై ప్రజల్లో వ్యతిరేకత వుంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని ముందు నుండే వూహిస్తున్నారు. కాని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్క రాష్ట్రంలో బీజేపీ ఓడిపోయినా అది కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనపై ప్రజావ్యతిరేకతగానే భావించాలి. ఎందుకంటే మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, ఛత్తీస్‌గఢ్‌లో రమణసింగ్‌లు వరుసగా మూడుసార్లు పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. వారి పాలనపై అక్కడి ప్రజల్లో వ్యతిరేకత లేదు. వారిపై అవినీతి కుంభకోణాల ఆరోపణలు లేవు. మరి ఆ రెండు రాష్ట్రాలలో బీజేపీ ఓడిపోయిందంటే అది కేంద్రప్రభుత్వంపై వ్యతిరేకతే అవుతుంది. నోట్ల రద్దు, జిఎస్టీ, పెట్రోల్ ధరలు వంటి వాటి ప్రభావమే వుంటుంది. మరి ఈ ఎన్నికల ఫలితాలకు 2019 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు పెద్ద గ్యాప్ వుండదు. ఈ కొద్దికాలంలో కేంద్ర ప్రభుత్వం ఈ వైఫల్యాలను భర్తీ చేసుకోవడం కూడా కష్టం. ఈ వ్యతిరేకతే దేశమంతటా వుంటుంది. ఈ రెండు రాష్ట్రాలలోనూ ఫలితాలు వ్యతిరేకంగా వుంటే బీజేపీ అధిష్టానం మళ్ళీ రామబాణానికి పదును పెట్టే అవకాశాలున్నాయి. అయోధ్య రామమందిర నినాదం మళ్ళీ మార్మోగే అవకాశం లేకపోలేదు.

హిందూత్వంపై బీజేపీ వైఖరి స్పష్టంగానే వుంటుంది. వాళ్ళేమీ ఈ విషయాన్ని దాచుకోరు. ఈ దేశంలో హిందువులను ఒక ఓటు బ్యాంకుగా మలచగలిగింది కూడా బీజేపీనే! హిందువులు సంఘటితం కానంతవరకు కాంగ్రెస్‌కు ఎదురు లేకుండా వుండింది. ఇప్పుడు బీజేపీ హిందూత్వం ప్రభావానికి కాంగ్రెస్ పరిస్థితి ఒక ప్రాంతీయ పార్టీ స్థాయికి పడిపోయింది. హిందువులను దూరం చేసుకుంటే దేశ రాజకీయాలకు శాశ్వతంగా దూరమవుతామని చెప్పే కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్‌లు ఈమధ్య పెద్దపెద్ద బొట్లు పెట్టి గుళ్ళు, గోపురాలు తిరుగుతున్నారు. బీజేపీ హిందూత్వ అస్త్రం దెబ్బకు వాళ్లు కూడా ఆ దారికి రాక తప్పలేదు.

పాలనా పరమైన విధానాలలో ప్రజలు తమపై వ్యతిరేకతతో వున్నారని తెలిస్తే, బీజేపీ రేపు ఎన్నికల్లో ప్రయోగించబోయే అస్త్రం రామభక్తి... దేశ భక్తి. ఈ రెండింటిపై బీజేపీ ఇప్పటికే పేటెంట్ సాధించినట్లుగా భావిస్తోంది. ప్రచారం కూడా ఆ స్థాయిలోనే వుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు, ఇతర లౌకికవాద పార్టీలన్నీ కూడా రాజకీయ ప్రయోజనాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టని పార్టీలుగా ముద్ర వేసుకున్నాయి. ఇక లౌకికత్వం ముసుగులో వీళ్ళందరూ రామనామాన్ని వ్యతిరేకిస్తారు కాబట్టి హిందూ వ్యతిరేకులే! ఈ రెండు అంశాలే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బలమైన అస్త్రాలు కానున్నాయి.



పాలనా పరమైన విధానాలలో ప్రజలు తమపై వ్యతిరేకతతో వున్నారని తెలిస్తే, బీజేపీ రేపు ఎన్నికల్లో ప్రయోగించబోయే అస్త్రం రామభక్తి... దేశ భక్తి. ఈ రెండింటిపై బీజేపీ ఇప్పటికే పేటెంట్ సాధించినట్లుగా భావిస్తోంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు, ఇతర లౌకికవాద పార్టీలన్నీ కూడా రాజకీయ ప్రయోజనాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టని పార్టీలుగా ముద్ర వేసుకున్నాయి.

---

### పంచభూతేశ్వరుడికి..

# భస్మంతో ప్రత్యేక పూజలు



నెల్లూరు, పప్పులవీధి శివాజీనగర్ లోని శ్రీరామమందిరంలో కొలువైవున్న పార్వతీదేవి సమేత శ్రీ పంచభూతేశ్వర స్వామివారికి ఈనెల 24న ఆలయ అర్చకులు భస్మంతో ప్రత్యేకపూజలు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని హరిహరాదులను స్మరిస్తూ ఆలయంలోని శ్రీ విఘ్నేశ్వరునికి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, అయ్యప్పస్వామికి, సత్యదేవునికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. రాత్రి పదకొండు అడుగుల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు రూపాన్ని శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. నేత్రపర్వంగా జరిగిన ఈ కార్యక్రమాల నిర్వహణకు మురళీకృష్ణ భక్తబృందంవారు, కనకదుర్గసేవాసమితి, కాపుగంటి ఆనందరావు, భాగ్యలక్ష్మి దంపతులు, బాలుస్వామి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

---


# భక్తిరసభరితం.. పోతన భాగవతం

- అవధాని కోట రాజశేఖర్

పోతన భాగవతం భక్తిరసభరితమైనదని, భగవత్తత్వాన్ని–భక్తితత్వాన్ని తెలియపరచే భాగవతం ఎంతోకాలం నుంచి ప్రసిద్ధమై లోకప్రఖ్యాతిని పొందిందని ప్రముఖ అవధాని శ్రీ కోట రాజశేఖర్ అన్నారు. ఈనెల 24న నెల్లూరు వర్ధమాన సమాజం వారు పెళ్లూరు పట్టాభిరామిరెడ్డి స్మారక ధర్మనిధి సౌజన్యంతో నిర్వహించిన మహాకవి పోతన సాహిత్యసభలో ఆయన పోతన భాగవతం–వైశిష్ట్యంపై ప్రసంగించారు. కార్తీకమాసంలో భక్త అంబరీషుడు నిర్వహించిన ద్వాదశీవ్రతం విశిష్టతను, అంబరీషుని భక్తిభావాన్ని వివరిస్తూ, కోపం–అహంకారం ఉన్నవారికి గర్వభంగం తప్పదని, అంబరీషోపాఖ్యానం ద్వారా అపకారికి కూడా ఉపకారం చేసే సుగుణాన్ని అందరూ అలవరచుకోవాలని తెలిపారు. సభాపోషకులు పెళ్ళూరు సుధాకర్‌రెడ్డి తమ తల్లిగారైన స్వర్గీయ పెళ్ళూరు వజ్రావతమ్మ స్మృత్యర్థం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి శేషారెడ్డి సభాధ్యక్షత వహించారు. వర్ధ మాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖులు పొన్నాల రామసుబ్బారెడ్డి, మోపూరు వేణుగోపాలయ్య, మెట్టు రామచంద్రప్రసాద్, చీమకుర్తి వేంకటేశ్వర్లు, కరిమద్దెల నరసింహారెడ్డి, ఊరుబిండి వేంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని అవధాని కోట రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు.



---




# తప్పు చేయొద్దు!

ఏవో మనకు చిన్న చిన్న సమస్యలు వచ్చాయని చెప్పి నరేంద్ర మోడీ లాంటి ప్రధానిని దూరం చేసుకోవద్దు. మరో ఐదేళ్ళు ఆయనకు అవకాశమివ్వాలి. ప్రధానిగా ఇలాంటి నిజాయితీపరులు, శక్తిమంతులు దొరకడం అరుదు. మన్మోహన్‌సింగ్ లాంటి తోలుబొమ్మలు ప్రధానులైతే దేశ ఉనికికే ప్రమాదం. విదేశీ భావజాలం అధికంగా వున్న సోనియా, రాహుల్‌గాంధీలు అసలు మనకొద్దు. తృతీయ కూటమి పేరుతో ప్రధాని రేసులో వున్న ఏ ఒక్క నాయకుడికి సచ్ఛీలత లేదు. నేర, అవినీతి చరిత్రలే! తప్పటడుగులు వేస్తున్న చంద్రబాబు మనుమడి ఆస్తి 18కోట్లు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా, నాలుగున్నరేళ్ళ నుండి ప్రధాన మంత్రిగా పనిచేస్తున్న నరేంద్రమోడీ ఆస్తి రెండున్నర కోట్లు. అది కూడా వారసత్వంగా వచ్చిన ఆస్తి. ఈ కాలంలో నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేసే వాళ్ళకు కూడా ఇంత ఆస్తి వుంటోంది. తన కుటుంబం కోసమో, తన కోసమో కాకుండా దేశం కోసం పనిచేస్తున్న ప్రధాని మోడీ! అలాంటి నాయకుడిని ఓడిస్తే మన నెత్తిన మనం మట్టేసుకున్నట్లే! విదేశాలకు దాసోహం అనే కాంగ్రెస్‌ను గెలిపిస్తే కోరి కష్టాలను తెచ్చుకున్నట్లే!

*సి.రాజీవి, నెల్లూరు.*

# నిప్పుగారు... ఇప్పుడేమంటారు?

చంద్రబాబు బినామీ, ఎంపి సుజనాచౌదరి బండారం బయట పడింది. డొల్ల కంపెనీలు సృష్టించి బ్యాంకులకు 5700 కోట్ల శఠగోపం పెట్టాడు. సుజనాచౌదరిపై గతంలోనే మారిషస్ బ్యాంక్ నోటీసులు జారీ చేసింది. సుజనాచౌదరి ఆర్థిక నేరగాడు కాబట్టే తొలుత నరేంద్రమోడీ ఆయనను తన కేబినెట్‌లోకి తీసుకోలేదు. తర్వాత చంద్రబాబే పట్టుబట్టి ఆయనను కేంద్రమంత్రిని చేశారు. కేవలం చంద్రబాబు అండ చూసుకునే ఆయన బ్యాంకులను ఇంతగా మోసం చేయగలిగాడు. విజయ్‌మాల్యా బ్యాంకుల నుండి వేలకోట్లు అప్పులు తీసుకుని కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సంస్థను పెట్టి దివాళా తీశాడు. ఆయనకి బ్యాంకులను మోసం చేయాలనే ఉద్దేశ్యం లేదు. సుజనాచౌదరి ఉద్దేశ్యపూర్వకంగానే బ్యాంకులను బురిడీ కొట్టించాడు. నేను నిప్పును అని చెప్పుకుని తిరిగే చంద్రబాబునాయుడు దీనిపై ఏం సమాధానం చెబుతారో?

*ఎస్.డి.సమద్, నెల్లూరు.*

### సోనియాను..

# జీవితంలో నమ్మకూడదు

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేసిన వారిలో సోనియాగాంధీదే మొదటి స్థానం. చరిత్రలో ఇది శాశ్వతంగా నిలిచే వుంటుంది. ఈరోజు ఓట్ల కోసం వచ్చి సోనియాగాంధీ మొసలు కన్నీళ్ళు కారుస్తుంది. అధికారంలోకి వస్తే ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇస్తుందంట! అధికారంలో వున్నప్పుడు ఒంటి మీద గుడ్డలతోనే ఆంధ్రులను రోడ్డు మీదకు తోసిన ఈ ద్రోహి మాటలు ఆంధ్రులు నమ్మకూడదు. కాంగ్రెస్‌కు సమాధి కట్టేసాం. ఆ సమాధిలో నుండి మళ్ళీ భూతాన్ని బయటకు తీయొద్దు. మరోసారి ఆంధ్రులు మోసపోయేందుకు సిద్ధంగా లేరు!

*చింతా శశిప్రణయ్, తిరుపతి.*

● గూడూరు

# వైసిపిలో పెరిగిన పోటీ

**తెరపై రోజుకో అభ్యర్థి... ఎవరి ప్రయత్నాల్లో వారు**






2014 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి వైసిపి అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్ గెలవడం తెలిసిందే! గెలిచాక టిడిపిలోకి జంప్ చేశాడు. ఒకవేళ వైసిపిలోనే వుండుంటే ఈ సీటు విషయంలో ఇంకో చర్చ వుండేది కాదు. ఆరునూరైనా ఆయనే అభ్యర్థి అయ్యుండేవాడు.

ఇప్పుడు గూడూరు వైసిపి సీటుకై ఎవరి ప్రయత్నాలలో వాళ్ళున్నారు. ఇన్‌ఛార్జ్‌గా వున్న మేరిగ మురళి తనదే టిక్కెట్ అనుకుంటున్నాడు. ఈమధ్య గూడూరుకు వచ్చిన పార్టీ జిల్లా పరిశీలకులు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో మేరిగ మురళిని గెలిపించాలని పిలుపునిచ్చి, ఆశావహులకు షాకిచ్చాడు. ఎందుకంటే రాష్ట్రంలో ఇంతవరకు రెండు అసెంబ్లీ సీట్లకు మాత్రమే జగన్ అభ్యర్థులను ప్రకటించాడు. అలాంటప్పుడు సజ్జల ఏ ఉద్దేశ్యంతో మురళిని గెలిపించాలని కోరాడో వైసిపి కార్యకర్తలకే అర్ధం కావడం లేదు. ఎందుకంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా గూడూరులో మురళీ చాలదనే అభిప్రాయం పార్టీ నాయకులలోనే వ్యక్తమవుతోంది. ఇక తమ సీట్లు గెలవడమే కష్టమైన మేకపాటి వాళ్ళు కూడా మురళికి సీటు ఇవ్వాలంటూ పట్టుబడుతుండడం ఇక్కడ కొసమెరుపు.

మాజీ జడ్పీటీసీ వీరి చలపతి కూడా గూడూరు సీటు రేసులో వున్నాడు. ఈయన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు. నియోజకవర్గానికి పూర్తిగా కొత్త. ఆర్ధికంగా మోటుకోగలడనే పేరు మాత్రం వుంది. స్థానికుడైన బత్తిని విజయకుమార్ కూడా యధావిధిగా రేసులో వున్నాడు.

వీళ్ళు కాకుండా 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన డాక్టర్ బి.జ్యోత్స్నలత పేరు కూడా వైసిపి తరఫున ప్రచారంలోకొస్తోంది. వైసిపి నాయకులే కొందరు ఆమె పేరును తెరమీదకు తెచ్చారు. ఈసారి ఎలాగూ టీడీపీ ఆమెకు సీటివ్వదు. ఆమెను వైసిపి నుండి నిలబెడితే జిల్లాలో ఒక మహిళకు సీటిచ్చినట్లుంటుంది. విద్యావంతురాలు, గూడూరు నియోజకవర్గంతో పరిచయం పెరిగింది. గత ఎన్నికల్లో ఓడిపోయిందనే సానుభూతి కూడా కొంత కలిసొస్తుంది. దీనికి తోడు ఆమె భర్త నాగరాజు ఆర్యవైశ్య వర్గానికి చెందినవాడు. గూడూరులో వారి బలమెక్కువ. కులపరంగా కూడా కలిసొస్తుంది. వీటన్నింటి దృష్ట్యా ఆమెను పార్టీలోకి తీసుకుని సీటివ్వడం మేలనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

అయితే ఆమె పుట్టినిల్లు టిడిపి కాబట్టి రేపు ఎన్నికల్లో ఆమె గెలిస్తే గూడూరులో మళ్ళీ పాశం ఎపిసోడ్ పునరావృతం అవుతుందన్న ఆలోచన కూడా పార్టీలో వుంది.

ఇప్పటికైతే గూడూరు వైసిపిలో వీళ్ళ పేర్లే వినపడుతున్నాయి. ఎన్నికలు దగ్గరయ్యే కొద్ది ఇంకెన్ని పేర్లు ప్రచారంలోకి వస్తాయో చూడాలి!?




# చెరొక సీటా!..

# ఒకే సీటుకై ఫైటా?

రాష్ట్రంలో వైసిపికి బలమైన ఓటు బ్యాంకు ముస్లింలు, క్రిస్టియన్‌లు. రానున్న ఎన్నికల్లో ఈ ఓటు బ్యాంకుకు కన్నం వేయాలనేది చంద్రబాబు పన్నాగం. బీజేపీతో పొత్తు వదులుకున్నది కూడా అందుకే! ఈమధ్య ముస్లిం, క్రిస్టియన్‌లను ఆయన దువ్వడం ఎక్కువైంది. చంద్రబాబు తన జీవితంలో ఎప్పుడూ భగవద్గీతను చదివి వుండడు గాని, క్రైస్తవ ప్రచార సభల్లో మాత్రం బైబిల్ వాక్యాలు చదువుతుంటాడు. ఇక ముస్లింలకు రకరకాల వరాలు ప్రకటిస్తున్నాడు. ఇవన్నీ వారి ఓట్ల కోసం పన్నుతున్న వల.

మరి ఓట్లు కావాలంటే మైనార్టీలకు సీట్లు కూడా ఇవ్వాలి కదా! రాష్ట్రంలోని 175అసెంబ్లీలలో కనీసం అయిదారు సీట్లన్నా ముస్లింలకు కేటాయించాల్సి వుంటుంది. ఈ లెక్కన చూస్తే ముస్లింలకు ఇవ్వదగిన సీట్లలో నెల్లూరు నగరం కూడా ఒకటిగా కనిపిస్తోంది. ముస్లిం ఓటర్లు అధికంగా వున్న నియోజకవర్గమిది. 2014 ఎన్నికలలోనే నెల్లూరు సిటీ వైసిపి సీటు కోసం అప్పుడు ఆ పార్టీలో వున్న అబ్దుల్ అజీజ్ ప్రయత్నించాడు. ఆయనకు ఎమ్మెల్యే సీటు బదులు మేయర్ సీటిచ్చారు. ఆయన ఆ పార్టీ తరపున మేయర్‌గా గెలిచి తర్వాత తెలుగుదేశంలో చేరడం జరిగింది.

ఇప్పుడు తెలుగుదేశం నెల్లూరు సిటీ సీటు కోసం అజీజ్ గట్టిగా పోరాడుతున్నాడు. ఈ విషయమై చంద్రబాబును కలిసాడు. ఇక లోకేష్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. మరోపక్క మైనార్టీల ద్వారా కూడా ముస్లింలకే నెల్లూరు సీటు ఇవ్వాలనే ప్రచారాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు.

నిన్నటివరకు నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ అన్న ప్రచారం నడిచింది. నారాయణ ఈ సీటు కావాలని పంతం పట్టడం లేదు. కాకపోతే చంద్రబాబు పోటీ చేయమని ఆదేశిస్తే మాత్రం దూకడానికి సిద్ధంగా వున్నాడు. సీటు విషయంలో ఆయనకు పేచీలు లేవు. కాకపోతే అజీజ్‌కు నెల్లూరు సిటీ ఇచ్చి, నారాయణను నెల్లూరు రూరల్‌లో దించాలనే ప్రతిపాదన కూడా వుంది. నెల్లూరు పార్లమెంట్‌కు టిడిపి అభ్యర్థిగా ప్రచారంలో వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా నారాయణను నెల్లూరు రూరల్ అభ్యర్థిగా రావాలని కోరుకుంటున్నాడు. నారాయణ వస్తే రూరల్‌లో బలమైన పోటీ వుంటుందని, తద్వారా ఎంపీగా తనకు కలిసొస్తుందని ఆయన ఆశ. మరి నెల్లూరు నగరం కాకుండా రూరల్‌కు పొమ్మంటే, నారాయణ ఒప్పుకుంటాడా? లేదా అన్నదే అనుమానం.?




- మళ్ళీ తెరపైకి ఆనం
- మందకొడిగా ఓట్ల నమోదు
- పార్టీల వారీగా ప్యానెళ్ళు

# వేడెక్కుతున్న విఆర్

వందేళ్ళకుపైగా చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక విఆర్ విద్యా సంస్థల పాలక వర్గానికి ఎన్నికలు షురూ అయ్యాయి. దాదాపు 3దశాబ్దాల పాటు సాగిన ఆనం సోదరుల ఆధిపత్యానికి సుప్రీం కోర్టు ఇటీవలే చెక్ పెట్టింది. వాళ్ళ పాలకవర్గం చెల్లదని తీర్పు నివ్వడం తెలిసిందే! వాస్తవంగా ఆనం నాయకత్వంలో ఏర్పడ్డ పాలకవర్గం చెల్లదంటూ ప్రత్యర్ధులు కోర్టుకు పోవడం ఆనం వాళ్ళకే మేలైంది. కోర్టులో కేసు లేకుంటే నిర్ణీత టైంకు మళ్ళీ పాలకవర్గానికి ఎన్నికలు జరిగివుండేవి. అప్పుడు పరిస్థితులను బట్టి బలాబలాలను బట్టి కొత్తోళ్ళు వచ్చినా వచ్చుండొచ్చు. కేసు కోర్టులో వుండడం వల్ల 30ఏళ్ళు పాలకవర్గానికి ఎన్నికలు లేకుండా పోయాయి. ఆనం వాళ్ళే పెత్తనం సాగిస్తూ వచ్చారు. ఇప్పుడు కమిటీని రద్దుచేసి ఉపయోగం లేకుండా పోయింది. వాళ్ళు 3దశాబ్దాలు అధికారం అనుభవించారు కదా! అంతకన్నా ఇంకేం కావాలి!

విఆర్ విద్యా సంస్థలకు కొత్త పాలక వర్గాన్ని ఎంపిక చేసే క్రమంలో ఓట్ల నమోదు ప్రక్రియ మొదలు కావడం తెలిసిందే! 2016 వరకు విఆర్ విద్యాసంస్థల్లో హైస్కూల్ నుండి పిజి వరకు చదివిన ఎవరైనా ఓటర్లుగా నమోదు కావచ్చు. కలెక్టరేట్‌లో దీని కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయగా పూర్వవిద్యార్థులు మందకొడిగా తమ ఓట్లను నమోదు చేసుకుంటున్నారు.

## పార్టీల వారీగా ప్యానెళ్ళు...

విఆర్ పాలక వర్గ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు, గెలిచేందుకు ఆయా పార్టీల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పావులు కదుపుతున్నారు. విఆర్ విద్యా సంస్థల్లో ఒకప్పుడు ఏబివిపి, ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు బలంగా వుండేవి. బీజేపీ అనుబంధ సంస్థ అయిన ఏబివిపి నాయకులే ఆనం పాలకవర్గంపై కోర్టుకు వెళ్లడం జరిగింది. ప్రస్తుతం బీజేపీ మద్దతుదారులైన ఆమంచర్ల శంకరనారాయణ సారధ్యంలో ఒక ప్యానెల్ ఏర్పాటై జోరుగా ఓట్ల నమోదు చేయిస్తోంది.

అలాగే వామపక్ష మద్దతుదారులు కూడా పాలకవర్గం ఎన్నికల్లో పోటీ చేసే దిశగా శరవేగంగా తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. ఓట్ల నమోదు ప్రక్రియను వీళ్ళు కూడా వేగవంతంగా జరిపిస్తున్నారు. ఇక ఎక్కడ అభివృద్ధి జరుగుతున్నా అడ్డుతగిలి, ఆటంకం కల్పించే మరో గ్యాంగ్ కూడా ఒక ప్యానెల్‌గా రంగంలోకి దిగి విఆర్ ఆస్తులను కబ్జా చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదంతా ఒకెత్తయితే విఆర్ విద్యాసంస్థలపై తమ పట్టును నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ఆనం వర్గీయులు కూడా ఒక ప్యానెల్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. వీళ్ళు ఇప్పటికే కరపత్రాల పంపిణీ కూడా మొదలుపెట్టారు. వి.ఆర్ విద్యాసంస్థలలో మొదలు, కొస తెలిసిన ఆనం రామనారాయణరెడ్డి ఈ ప్యానెల్‌ను నడిపిస్తున్నాడు. పాత ఓటర్ల లిస్టుతో పాటు కొత్త ఓటర్లకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా వీరి వద్దే వుండొచ్చు. ఓట్లు నమోదు, ఓటర్లను కలవడం వీళ్ళకు కొంత సులభమైన పని. పాలకవర్గానికి ఎన్నికలు జరిగినా కూడా విఆర్ విద్యా సంస్థలపై తమ పెత్తనం పోకూడదనే ఉద్దేశ్యంతోనే పోరాటానికి సిద్ధమయ్యారు. ఓట్ల నమోదు పూర్తయితే పాలక కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావచ్చు. 2019 జనరల్ ఎలక్షన్స్ కంటే విఆర్ ఎలక్షన్సే నెల్లూరులో ముందుగా టెన్షన్ వాతావరణం తెచ్చేసింది.

**విదేశీపక్షుల కిలకిలారావాలతో..**

# కళకళలాడుతున్న నేలపట్టు



ఇటీవల కురిసిన వర్షాలతో దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం పక్షుల కిలకిలారావాలతో పులకించిపోతోంది. గత నాలుగైదు రోజులుగా ఈ ప్రాంతంలో విదేశీ విహంగాల సందడి మొదలైంది. పక్షుల కేంద్రంలోని రెండు చెరువుల్లోకి నీళ్ళు చేరడంతో పక్షుల ఆహారవిహారాలకు లోటులేకుండా ఉంది. దూరదేశాల నుంచి ఇక్కడికి వచ్చే రకరకాల రంగురంగుల పక్షులతో నేలపట్టు పర్యాటకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే ప్రసిద్ధమైన పెలికాన్ పక్షులు(గూడబాతులు) వందల సంఖ్యలో ఇక్కడికి చేరాయి. ఇంకా తెల్లకంకణాయిలు, నత్తగుల్ల కొంగలు, నీటికాకులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి చెరువుల గట్లపై ఉన్న కడపచెట్లపై వాటి గూళ్ళు కట్టుకుంటున్నాయి. సుమారు 5వందలకు పైగానే పెలికాన్‌లు, 2వందలకు పైగా తెల్లకంకణాయిలు, 3వందలకుపైగా నత్తగుల్ల కొంగలు, వందలాది నీటికాకులు, బాతుజాతికి చెందిన రకరకాల పక్షులు నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలోకి వచ్చాయని వన్యప్రాణి సంరక్షణ అధికారులు పేర్కొంటున్నారు.



## కిక్కు ఎక్కితే... ఏ వాహనమైనా ఒకటే..!

- ఎస్పీ కారునే గుద్దేశారు

నెల్లూరులో పరిస్థితులు ఎలా వున్నాయో ఎస్పీకి ప్రత్యక్షంగా తెలపాలను కున్నారో ఏమోగాని ఒక ఆటోడ్రైవర్ తాగిన మత్తులో ఎస్పీ వాహనాన్నే గుద్దేశాడు. తాగి డ్రైవింగ్ చేసేవాళ్ళ తాటతీయాల్సిన అవసరం ఎంతైనా వుందని ఈ సంఘటన ద్వారా చాటిచెప్పారు. వివరాలలోకి వెళ్తే... 25వ తేదీ ఎస్పీ ఐశ్వర్య రస్తోగి సతీమణి ఇన్నోవా వాహనంలో శ్రీ రాజ రాజేశ్వరి గుడికి వెళుతోంది. పెద్దాసుపత్రి వద్దనున్న స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనం స్లోకాగా, ఆ వెనుకే వున్న ఆటో ఎస్పీ వాహ నాన్ని వెనుక నుండి గుద్దేసింది. ఇన్నోవా వెనుకభాగం కొంత దెబ్బతినగా ఆటో ముందు భాగం బాగా దెబ్బతింది. ఆటో డ్రైవర్ భీమకొండ ఆనంద్ మద్యం మత్తులో ఆటో నడిపినట్లుగా పోలీసులు గుర్తించారు. ట్రాఫిక్ డిఎస్పీ మల్లిఖార్జున, సి.ఐ వేమారెడ్డిలు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఎస్పీ సతీమణిని మరో వాహ నంలో గుడికి పంపించారు. తాగి ఆటో నడిపిన ఆనంద్‌పై కేసు నమోదు చేశారు.

## బోడిగాడితోటలో పోలీసు తనిఖీలు

నెల్లూరు నగరం నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని బోడిగాడి తోటలో 25వ తేదీ పోలీసులు కార్డన్‌సర్చ్ నిర్వహిం చారు. అసాంఘిక శక్తులు, విద్రోహులను పట్టుకునేందుకు ఇలాంటి తనిఖీలు నిర్వ హిస్తుంటారు. పోలీసులు ఇక్కడ ప్రతి ఇంటిని తనిఖీ చేసి గుర్తింపు కార్డులను పరిశీలించారు. 35మంది అనుమానితు లను అదుపులోకి తీసుకోవడమే కాక ఎలాంటి పత్రాలు లేని 25బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో నగర డిఎస్పీ మురళీకృష్ణ, సిసిఎస్ డిఎస్పీ బాలసుందరరావు, సిఐలు సుబాన్, వేణు గోపాల్‌రెడ్డి, బాబీజాన్ సైదాలు పాల్గొన్నారు.

## రాయితీతో ప్లాట్లు

నెల్లూరురూరల్ మండలంలో కె.కె. గుంట, ఆమంచర్ల, బొడ్డువారిపాలెంలలో రూపుదిద్దుకున్న ఎంఎస్‌ఎంఇ పార్కులలో ఎస్సీ, ఎస్టీ, బిసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 50శాతం రాయితీతో ప్లాట్లను అందజేస్తున్నట్లు ఏపిఐఐసి జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల గురించి ఎలాంటి వివరాలు కావలన్నా 91105 56145, 9948392418 నెంబర్లలో సంప్రదించా లని ఆయన కోరారు.

## శబరిమలై భక్తులకు ఆర్టీసీ సేవలు

శబరిమలైకి వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం నెల్లూరు ఆర్టీసీ మెయిన్ బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ప్రైవేట్ కంటే తక్కువ ఛార్జీకే బస్సులు ఇస్తామం టున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో వున్నాయి.

## వేమిరెడ్డి చొరవతో.. బాధితుడికి పిఎం సాయం



రాజ్యసభ సభ్యులు వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డి తీసుకున్న చొరవ, చూపిన మానవత్వంతో వినికిడి సమ స్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ప్రధాన మంత్రి సహాయనిధి నుండి 3లక్షల రూపాయలు మంజూరయ్యాయి. కడప జిల్లా జోగిరెడ్డిపల్లికి చెందిన లోకేశ్వరరెడ్డి వినికిడి సమస్యతో బాధపడుతుండేవాడు. చికిత్స చేయించుకునేంత ఆర్థిక స్తోమత లేదు. ఈ నేపథ్యంలో తెలిసిన వారి ద్వారా నెల్లూరొచ్చి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన వేమిరెడ్డి, అతని పూర్తి వివరాలు, ఆరోగ్య సంబంధిత రికార్డులతో ప్రధాని కార్యా లయానికి అతని వైద్య చికిత్సకు ఆర్థిక సాయం చేయాలని కోరుతూ లేఖ వ్రాశారు. దీనిపై స్పందించిన పిఎంఓ వెంటనే మూడు లక్షలు మంజూరు చేస్తూ దీనికి సంబంధించిన ప్రతిని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పంపింది. మానవత్వంతో స్పందించి తమను ఆదుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి లోకేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## పోలీసు వాహనాలకు మోక్షం కలిగింది

ప్రభుత్వ వాహనాలు మరమ్మత్తులకు గురైతే మూలపడి తుప్పుపట్టి పోవడం చూస్తుంటాం. లక్షల విలువచేసే వాహ నాలను చివరకు ఇనుప సామాన్ల వాళ్ళు కూడా కొనలేని పరిస్థితి వస్తుంది. ఇలా ఎన్నో వందల ప్రభుత్వ వాహనాలు ఒక్క నెల్లూరు జిల్లాలోనే తుప్పుపట్టి పోయి వుంటాయి.

పోలీసు శాఖలో వాహనాల వాడకం ఎక్కువగా వుంటుంది. ఎప్పటికప్పుడు కొత్త వాహనాలు పోలీసులకు వస్తుంటాయి. ప్రస్తుతం జిల్లా పోలీసు శాఖలో ఇలాంటి వాహనాల వేలం పాటకే డిసెంబర్ 6వ తేదీన ముహూర్తం నిర్ణయించారు. 9 కమాండర్ జీపులు, 4 టాటా సుమోలు, 3టయోటా క్వాలిస్‌లు, 2 స్కార్పియో, ఒక ఫోర్డ్ ఎకో స్పోర్ట్స్ కారు, ఒక టాటా 407 బస్సు, రెండు బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్, ఒక ఈచార్ ట్రాప్ క్యారియర్, 6హీరోహోండా సి.డి బైక్‌లు, 8 టివిఎస్ విక్టర్ బైక్‌లు, 12 హీరోహోండా స్ప్లెండర్ బైక్‌లు, 267టైర్లు, 178 ట్యూబ్‌లు 56 బ్యాటరీలు, 62వ్లగ్‌లకు ఈ-వేలం నిర్వహించనునామని ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యా లయంలో 6వ తేదీ ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు వేలం పాట జరుగుతుంది. వేలంలో పాల్గొన దలచిన వారు ముందుగా వెయ్యిరూపా యలు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలి. వేలం పాటలో పాల్గొనేవాళ్ళ కోసం డిసెంబర్ 4వ తేదీ వరకు పోలీసు మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వీటిని ప్రదర్శనకు ఉంచారు. పూర్తి వివరాలకు ఎవరైనా 9440796368 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

# నెల్లూరు కబుర్లు

## ఛాయ్ తాగితే మంత్రి... ఛాయ్ అమ్మితే ప్రధానమంత్రి



ఛాయ్... టీ... తేనీరు... పేరు ఏదైనా రంగు, రూపం, రుచి ఒక్కటే. మనసుకు ఉల్లా సాన్ని, మెదడుకు ఉత్తే జాన్ని అందించే ఔషధం. ఎంతటి విఐపికైనా నిద్ర లేవగానే గొంతులో గుక్కెడు టీ, కాఫీ వంటివి పడాల్సిందే! రాష్ట్రపతి, ప్రధాని స్థాయి నాయకులు కూడా కాన్వాయ్‌లో వెళుతూ వెళు తూ దారిపక్కన కార్లు ఆపి దాబాల వద్ద, టీ బంకుల వద్ద టీ తాగిన సందర్భాలున్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక 'టీ'కి మరింత ప్రాధాన్యత పెరిగింది. తాను 'టీ' అమ్ముకునే దశ నుండి ప్రధాని స్థాయికి వచ్చానని ఆయన చెప్పుకుంటుంటాడు. 'టీ' అమ్మిన వ్యక్తే ప్రధాని అయితే... టీ తాగినవాళ్ళు ఇంకేం కావాలి...? అందుకనేనేమో ఈమధ్య మంత్రులు కూడా రోడ్ల పక్కన కార్లను ఆపుకుని టీలు, కాఫీలు తాగుతున్నారు. మొన్న నెల్లూరు చిన్నబజారులో వెళ్తుండగా మంత్రి నారాయణ కూడా అదే పని చేశాడు. తన కారాపి మిగతా అనుచరులు, నాయకులతో కలిసి టీ బంకు వద్ద 'టీ' తాగారు.

## అభిమానుల ఆనంద వేడుకగా... ఆల్తూరు జన్మదిన పండుగ



శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్ ఆల్తూరి గిరీష్‌రెడ్డి జన్మ దిన వేడుకలు నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, దీక్ష మాలాధారణ చేసిన భక్తులు కేక్ కట్ చేసి, గజమాలతో ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## జూడోలో విశ్వసాయి విద్యార్థి.. గోల్డ్‌మెడల్ సాధించాడు




నెల్లూరులోని విశ్వ సాయి జూనియర్ కళా శాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న ఏ.ఉదయ్‌తేజారెడ్డి జూడోలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించి గోల్డ్‌మెడల్ కైవశం చేసు కున్నాడు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ, క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలు శారీరక ధారుడ్యాన్నే కాక క్రమశిక్షణను కూడా పెంచుతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ఆనం రామకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడల్లో జూడో విభాగంలో సత్తాచాటిన ఉదయ్‌తేజారెడ్డిని కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు అందరూ అభినందించారు.

## మనుషులు బదులు... మ్యాన్‌హోల్ క్లీనర్

నగరంలోని డ్రైనేజీ గుంతల్లో పారిశుద్ధ్య కార్మికులు దిగి పీకల దాకా మునిగిపోయి ఆ డ్రైనేజీని క్లీన్ చేయడం చూస్తుంటే కడుపు తరుక్కుపోయేది. ఈ ఆధునిక కాలంలో కూడా కడుపు కూటి కోసం మనిషి ఇంత ఛండాలం భరించాలా అని బాధేసేది. ఇప్పుడు మనుషులతో పని లేకుండా మ్యాన్‌హోల్ క్లీనర్స్ వచ్చాయి. నెల్లూరు కార్పొరేషన్ వాళ్ళు నగరంలో వీటిని ఉపయోగించి డ్రైనేజీని క్లీన్ చేస్తున్నారు. రోడ్లపై వున్న మ్యాన్‌హోల్‌ను తెరచి దీనిని అక్కడ అమరుస్తారు. వ్యాక్యూమ్ క్లీనర్‌ను లోపలికి పంపి నీటి ప్రవాహానికి అడ్డుగా వుండే చెత్తనంతా లాగేస్తారు. ఈ యంత్రానికి సి.సి. కెమెరాలు కూడా అమర్చివుండడంతో ఎక్కడెక్కడ చెత్త పేరుకుపోయిందో కూడా ఇట్టే తెలిసిపోతుంది. మంత్రి నారాయణ సోమవారం దీని పనితీరును పరిశీలించారు.

## నెల్లూరుకు వివిప్యాట్‌లు




వచ్చే ఎన్ని కల్లో వాడడం కోసం సోమ వారం ఏడు కంటైనర్లలో 6900 వివి ప్యాట్‌లు నెల్లూరుకొచ్చాయి. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలోని గోడౌన్‌లో వీటిని దించారు. ఎన్నికలలో ఈ యంత్రాలను ఈవిఎంలకు అనుసంధానిస్తారు. దీనివల్ల ఓటరు తాను వేసిన ఓటు ఎవరికి పడిందో తెలుస్తుంది. ఈవిఎంలపై వున్న అనుమా నాలను నివృత్తి చేయడం కోసం వివిప్యాట్ లను ఏర్పాటు చేస్తున్నారు.

## ఇన్‌ఛార్జ్ డిటిసిగా చందర్

జిల్లా ఇన్‌ఛార్జ్ ఉపరవాణాధికారిగా బి.చందర్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన గూడూరు ఆర్టీఓగా వున్నారు. డిటిసి శివరాంప్రసాద్ ఒక వారం పాటు శిక్షణ నిమిత్తం వెళ్ళడంతో ఆయన వచ్చే దాకా చందర్ ఇన్‌ఛార్జ్ డిటిసిగా పనిచేస్తారు.

## వీఆర్ ఎస్సైలకు పోస్టింగ్‌లు

వీఆర్‌లో వున్న ముగ్గురు ఎస్సైలను వివిధ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో వున్న ఎస్సైలు పి.వెంకటసాయిని కందలేరుకు, ఎం.గంగా ధరంను శ్రీహరికోటకు, పీవీ సుబ్బారావును సోమశిల పోలీస్‌స్టేషన్ కు అటాచ్ చేసారు. సోమశిలలలో పనిచేస్తున్న జీ.వెంకటేశ్వర్ రెడ్డిని కమాండ్ కంట్రోలుకు బదిలీ చేశారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విపిఆర్ విద్యార్థి

విపిఆర్ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న ఖమ్రుద్దీన్ ఈనెల 30న విశాఖలో జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్ -17 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల కరెస్పాండెంట్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆమె ఆ విద్యార్థిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు తాము ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఆ విద్యార్థికి విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.నారాయణరెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

## హెచ్ఎంకు పదవి

నెల్లూరు జిల్లా ముత్తుకూరు హైస్కూల్లో హెచ్ఎంగా పనిచేస్తున్న వై.చెంచు రామయ్య ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితు లయ్యారు. విజయవాడలో ఈనెల 25న జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయ నను ఈ పదవికి ఎంపికచేశారు. ముత్తు కూరు హైస్కూలు ఉపాధ్యాయులు, ఇతర హైస్కూళ్ళ హెచ్ఎంలు చెంచురామయ్యకు అభినందనలు తెలిపారు.

## విద్యార్థుల కోసం...
# ఉచితంగా బియ్యం

- తుంగా రాజగోపాలరెడ్డి ట్రస్ట్ వితరణ
- విడవలూరు పిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల కోసం విద్యాసంవత్సరానికి సరిపడా బియ్యం అందించిన శివప్రభాత్‌రెడ్డి



విడవలూరులోని పొన్నలూరు రామచంద్రారెడ్డి మరియు వెంకటసుబ్బమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు భోజన వసతి కూడా లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, తన తండ్రి, 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి ట్రస్టు పేర ఓ విద్యా సంవత్సరానికి సరిపడా బియ్యాన్ని ఉచితంగా అందజేశారు.

ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల ఇబ్బందిని కళాశాల సిబ్బందితో పాటు మరికొంతమంది సంఘ సేవకులు ప్రభు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి ఒక యేడాదికి సరిపడా 25 బస్తాల బియ్యాన్ని విడవలూరుకు పంపించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి, శివప్రభాత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ అడిగిన వెంటనే తమ నాన్నగారి పేరున ఓ విద్యా సంవత్సరానికి సరిపడా బియ్యాన్ని పంపడం అభినందనీయమని అన్నారు. సామాజిక స్పృహతో సమాజ సేవలో ముందుంటూ తమ నాన్నగారి పేర పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న శివప్రభాత్‌రెడ్డి ధన్యుడని అన్నారు. ఒకప్పుడు ఎంతో ఘనచరిత్ర కలిగిన ఈ కళాశాలకు దాతల సహకారంతో పూర్వవైభవం తెచ్చేందుకు కళాశాల సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవి రమణారావు, డాక్టర్ ఆర్‌వివిఎస్ ప్రసాద్, శ్రీరామమూర్తి, జాన్‌పాల్, బాలకోటేశ్వరరావు, వెంకటప్రసాద్, శ్రీధర్‌శర్మ, శ్రీమతి అనూరాధ, హాస్టల్ డెప్యూటీ వార్డెన్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న ప్రక్రియలతో విద్యాబోధన చేయనున్న...
# శ్రీసిటీ 'క్రియా' యూనివర్శిటీ

### - ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



వినూత్నమైన ఆలోచనలతో, నూతన ప్రక్రియల ద్వారా విద్యాబోధన చేయనున్న శ్రీ సిటీ 'క్రియా' యూనివర్శిటీ విజయవంతం కావాలని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. శ్రీసిటీ కేంద్రంగా ప్రముఖ ఆర్థికవేత్తలు, పారిశ్రామికవేత్తల సహకారంతో విలువలతో కూడిన ఉత్తమ అధునాతన విద్యా విధానాల రూపకల్పతో ఏర్పాటుచేసిన క్రియా యూనివర్శిటీని ఇటీవల ఆయన ఢిల్లీలోని తన నివాసం నుంచి ఆన్‌లైన్‌లో లాంఛనంగా ప్రారంభించి ప్రవేశాల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, సంబంధిత రంగాల్లోని పలు అంశాలను అనుసంధానిస్తూ పాఠ్యాంశాలను రూపొందించడం మంచి ఆలోచన అని, సరికొత్త విద్యా విధానాలతో ప్రముఖుల భాగస్వామ్యంతో శ్రీసిటీలో క్రియా యూనివర్శిటీ ఏర్పాటు కావడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. దీని కోసం అవసరమైన భూమిని ఉచితంగా అందిస్తున్న శ్రీసిటీ యాజమాన్యాన్ని ఉపరాష్ట్రపతి అభినందించారు. 'క్రియా' యూనివర్శిటీ ఏర్పాటు శ్రీసిటీకి మరో మైలురాయి అనీ, శ్రీసిటీలో ఇప్పటికే చిన్మయా విద్యాలయ, ట్రిపుల్ ఐటి, ఐఎఫ్ఎంఆర్ వంటి విద్యాకేంద్రాలు ఉన్నాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి అన్నారు. ఈ యూనివర్శిటీ ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి విద్యా వసతులు అందుతాయని, ఈ యూనివర్శిటీకి ప్రపంచంలోని అత్యుత్తమ విద్యావేత్తల పర్యవేక్షణలో పాఠ్యాంశాలను రూపొందించనున్నారని తెలిపారు. శ్రీసిటీలో సుమారు 20 ఎకరాల స్థలంలో నిర్మించబోతున్న ఈ యూనివర్శిటీ తాత్కాలికంగా ఐఎఫ్ఎంఆర్ క్యాంపస్‌లో తరగతులను నిర్వహిస్తుందని, మొదటగా బిఏ, బిఎస్సీ కోర్సులను ప్రారంభిస్తారని, ఇందులో ఎకనామిక్స్ నుంచి కంప్యూటర్ సైన్స్ వరకు వివిధ రకాల కోర్సులుంటాయని, ప్రవేశాల ప్రక్రియ పూర్తిచేసుకుని వచ్చే ఏడాది ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, బయోకాన్ సిఎండి కిరణ్ మజుందార్‌షా, మహీంద్ర అండ్ మహీంద్ర అధిపతి ఆనంద్ మహీంద్ర, శ్రీసిటీ ఛైర్మెన్ సి.శ్రీనివాసరాజు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఛైర్మెన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో ప్రధాన సలహాదారు ఎస్.రామదొరై తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుడికి... ప్రతిష్టాత్మక అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఆకట్టుకున్నాడు మోహన్‌రెడ్డి. మల్టీప్లెక్స్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, పలు ఇతర భాషాచిత్రాల ప్రదర్శనలకు సబ్‌టైటిల్స్ వేయడం, డబ్బింగ్ చిత్రాలను నిషేధించడం వంటి సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని భారతదేశంలోనే అత్యుత్తమ మల్టీప్లెక్స్‌గా నవంబర్ 20వ తేదీన ముంబయిలో జరిగిన ఓ వేడుకలో ఈ అవార్డును ఐమాక్స్ కార్పొరేషన్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ జాన్‌ఫ్రైనర్ చేతుల మీదుగా అందుకున్నాడు ఉదీప్‌రెడ్డి. భారతదేశంలో వున్న అన్ని మల్టీప్లెక్స్‌లకన్నా ఎక్కువ స్క్రీన్‌లు కలిగి వుండడమే కాకుండా, అందం, ఆకర్షణ, నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇచ్చే అవార్డును మాయాజాల్ కైవసం చేసుకుంది. "ఐమాక్స్ బిగ్ సినీ అవార్డ్స్ 2018" పేరుతో ముంబైలో జరిగిన వేడుకలో మాయాజాల్ తరపున ఉదీప్ ఈ అవార్డును అందుకున్నాడు. ఉదీప్ మరియు మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులకు 'లాయర్' అభినందనలు.

# ఇంత అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు

### - మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



రెండున్నర దశాబ్దాలలో రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్నంత అభివృద్ధిని తాను గతంలో ఎన్నడూ చూడలేదని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 29వ తేదీ నెల్లూరు రూరల్ మండలం, కోడూరు పాడులో మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి రోడ్డు, పార్కు నిర్మాణానికి ఆయన శంకుస్థాపనకు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరుపాడుకు పట్టణ రూపురేఖలు రానున్నాయని, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అడగకుండానే పార్క్‌ను కేటాయించారని అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. మేయర్ అబ్దుల్, అజీజ్ మంత్రి నారాయణ తోడ్పాటుతో ఈ గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని హామీ ఇచ్చినట్టు గానే 15 రోజుల్లో కరెంటు వేయించామని, ఇక్కడి స్థానికులకు ముందుగా పట్టాలు కేటాయించి ఆ తర్వాత ఇల్లు నిర్మాణం జరిగేందుకు కృషి చేస్తామని చెప్పారు. నెల్లూరు నగరంలో 15 గ్రామాలు విలీనమయ్యాయి. వీటికి ముఖ్యమంత్రి దాదాపు నాలుగు వందల కోట్ల రూపాయలు కేటాయించారని, ఇక్కడ అభివృద్ధి చేసి ప్రజల అభిమానంతో ఓట్లు పొందాలనేది మా సంకల్పం అని, నగరంలో 70 పార్కులు ఏర్పాటు కానున్నాయని, కోడూరుపాడులో ఏర్పాటు చేయదలచిన పార్కు కూడా అన్ని వసతులతో సిద్ధం కానుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, సీనియర్ నేతలు ఆనం జయకుమార్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హరిబాబు యాదవ్ కార్పొరేటర్లు స్వర్ణ వెంకయ్య శైలజ అవినాష్ బండి రమేష్ పాశం శ్రీనివాసులు డాక్టర్ సునీల్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు




మాయాజాల్ సాధించిన అవార్డులు




## తండ్రీ కొడుకుల అద్భుత సృష్టి...

# మయసభను మరపించే మాయాజాల్



### 16 స్క్రీన్‌లతో 30 సినిమాలు, రోజుకి 80 ప్రదర్శనలు

### వీటితో పాటుగా ఆటలు, ఫుడ్‌కోర్టులు వివిధ కాలక్షేపాలు

*నిర్మాణ రంగంలో మేటి తండ్రి... నేడు ఆయనకు ధీటుగా వినోద రంగంతో పాటు నిర్మాణ రంగంలో కూడా తనకు తానే సాటిగా ఎదుగుతున్నాడు ఆయన కుమారుడు. నెల్లూరువాసి, గత 4 దశాబ్దాలుగా నిర్మాణ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న నిర్మాణ మాంత్రికుడు బోగొల్లు మోహన్‌రెడ్డిని తెలియని వారుండరు. చెన్నైలో రజనీకాంత్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రాఘవేంద్ర కళ్యాణ మండపం, తిరుమలలో తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఆరోజుల్లోనే అత్యంత అధునాతనంగా నిర్మించిన ఇందిరా గెస్ట్‌హౌస్, నెల్లూరులో 'రోమన్' తరహాలో నిర్మితమైన నారాయణ మెడికల్ కాలేజీ, నారాయణ డెంటల్ కాలేజీల సముదాయాలూ... ఇలా చెప్పుకుంటూ పోతే సంచలనాత్మక నిర్మాణాల సారధిగా వినూత్న ఆవిష్కరణలకు వారధిగా మోహన్ అసోసియేట్స్ మోహన్‌రెడ్డి ప్రస్థానం అసమానం.*



ఇప్పుడు ఆయన కుమారుడు ఉదీప్‌రెడ్డి తన తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు. సరిక్రొత్త ట్రెండ్‌ని సమాజానికి పరిచయం చేయడంలో తండ్రితో పోటీ పడుతున్నాడు. చెన్నైలోని ఇ.సి.ఆర్ రోడ్డులో అత్యంత ఆకర్షణగా దర్శనమిచ్చే "మాయాజాల్" సినీ ప్రపంచాన్ని అత్యాధునిక వినోద సముదాయంగా అందించి అందరి ప్రశంసలు పొందుతూ ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు కూడా అందుకున్నాడు. కొడుకు ఆలోచనలకు తండ్రి రూపకల్పన చేస్తే, తండ్రి ఆకాంక్షలకు కొడుకు సజీవరూపం కల్పిస్తున్నాడు. నాన్న, అన్నలకు తోడుగా మోహన్‌రెడ్డి చిన్న కుమారుడు 'సందీప్' ఇంటీరియర్ డిజైనింగ్‌లో తన నైపుణ్యతను ప్రదర్శిస్తూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా తన ప్రతిభను చూపుతున్నాడు. ఈ ముగ్గురి కలయికలో నడుస్తున్న "మాయాజాల్" వినోద ప్రాంగణంతో పాటు "మయాన్స్" గృహ సముదాయాల నిలయం కూడా ఇప్పుడు తమిళనాట టాక్ ఆఫ్ ది స్టేట్‌గా మారింది.

2001-2002 ప్రాంతాలలో చెన్నై నగరానికి దూరంగా ఆరోజుల్లోనే 6స్క్రీన్‌లతో భారతదేశంలోనే మొట్టమొదటి మల్టీప్లెక్స్‌గా ప్రారంభమై, స్క్రీన్‌లకు తోడుగా గేమింగ్ జోన్, ఫుడ్‌కోర్టులు, షాపింగ్ వంటి సౌకర్యాలను అందించిన తొట్టతొలి లోగిలిగా ఈ 'మాయాజాల్' అవతరించింది. కాలక్రమంలో 6కి మరో 10స్క్రీన్‌లను జోడించుకుని 16 స్క్రీన్‌లతో ఇప్పుడు మళ్ళీ భారతదేశంలోనే అతిపెద్ద మల్టీప్లెక్స్‌గా చరిత్ర సృష్టిస్తోంది.

### రోజుకి 30 సినిమాలు 80 షోలు..

ఇక్కడ రోజుకి 30 సినిమాలు ప్రదర్శితమౌతాయి. 80 షోలను ప్రేక్షకులు వీక్షిస్తారు. కేవలం సినిమా కోసమే కాకుండా ఇక్కడున్న విందు, వినోద సదుపాయాలను కూడా ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరూ ఆస్వాదించాల్సిందే. తమిళం, తెలుగు, హిందీ, మళయాళం, ఇంగ్లీష్, కన్నడ సినిమాలతో పాటుగా ఇక్కడ గుజరాతి, మరాఠి, బెంగాలి సినిమాలు కూడా ప్రదర్శిస్తారు. ఇంగ్లీషు నుండి తెలుగుకి లేదా ఒక భాష నుండి మరో భాషకి అనువదించబడిన చిత్రాలను ప్రదర్శించబోమంటూ భారతదేశంలోనే తొలిసారిగా నిషేధించిన సంస్థ మాయాజాలే! అంతే కాదండోయ్... ఇక్కడ ఇతర భాషా చిత్రాలు ప్రదర్శితమయ్యేటప్పుడు అందరికీ అర్ధమయ్యేలా సబ్‌టైటిల్స్‌ను పరిచయం చేసిన తొలి సంస్థ కూడా "మాయాజాలే"!

### 5 కోట్ల నుండి 100 కోట్లకు పెరిగిన వార్షిక టర్నోవర్..

2003-2004 సంవత్సరాలలో 5కోట్ల వార్షిక టర్నోవర్ వున్న మాయాజాల్ ఇప్పుడు 100కోట్ల వార్షిక టర్నోవర్ స్థాయికి ఎదిగిందంటే ఈ విజయం వెనుక ఉదీప్ కృషి, ఉదీప్ కృషి వెనుక మోహన్‌రెడ్డి మేధస్సు, ప్రతిభ, అనుభవం ఏ స్థాయిలో ఉపయోగపడి వుంటాయో మనం ఊహించుకోవచ్చు.








## మాయాజాల్‌కి తోడుగా మయాన్స్

30ఎకరాల విస్తీర్ణంలో వున్న ఆహ్లాదకరమైన ప్రాంగణం ఎలా సద్వినియోగం కావాలి... అన్న ఆలోచన నుండి పుట్టిందే 'మయాన్స్' లగ్జరీ గేటెట్ కమ్యూనిటి విల్లాస్ ప్రాజెక్ట్. ఆ ఆలోచన ఇప్పుడు ఆచరణలోకి వచ్చింది. భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో నివసిస్తున్న తమిళ కుటుంబాలకు అది ఆకర్షణగా మారింది. అంతేకాకుండా దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ప్రాపర్టీస్ షోలో ఉత్తమ నిర్మాణంగా "మయాన్స్" అవార్డు కూడా అందుకుంది.

మాయాజాల్‌కి తోడుగా 'మయాన్స్' లగ్జరీ విల్లాస్, వాటితో పాటు 'ఇసి 14' అధునాతన అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్. ఇవన్నీ ఇప్పుడు మాయాజాల్ ప్రాంగణంలో వెలసిన అదనపు హంగులు. రానున్న రోజుల్లో ఇక్కడ 700 కుటుంబాలు నివాసముంటాయి. అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యవంతమైన నివాసానికి 'మయాన్స్' వేదిక కాబోతోంది. చెన్నై మహానగరంలో ప్రత్యేకించి సముద్రతీరానికి అతి దగ్గరలోని ఇసిఆర్ రోడ్డులో ప్రధాన ఆకర్షణగా అందరినీ ఆకట్టుకుంటున్న ప్రాంతం 'మాయాజాల్' మరియు 'మయాన్స్'.

### కొత్త హంగులు..

ఇటీవలే భారీ వ్యయంతో 'మాయాజాల్'లోని మొత్తం 16 స్క్రీన్‌లను ఒక దానితో ఒకటి పోటీ పడేలా ఇంటీరియర్ డిజైన్స్‌తో కొత్త హంగులు సమకూర్చారు. ఈ ఆధునీకరణలో మోహన్‌రెడ్డి, ఉదీప్, సందీప్‌లు చేసిన కృషి అభినందనీయం. ఈ తండ్రీకొడుకులు భవిష్యత్తులో ఇంకా అనేక సంచలనాలను సృష్టించాలని కోరుకుంటోంది 'లాయర్'.



# ఉత్సాహంగా ముగిసిన పోలీస్ క్రీడలు

## బహుమతి ప్రదానం చేసిన ఎస్పీ ఐశ్వర్యరస్తోగి



క్రీడలు మానసికోల్లా సాన్ని కలిగిస్తాయని, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. ఈ నెల 29న ఆయన నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2018 ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు అరగంటన్నా ఆటలు ఆడాలని సూచించారు. మానసిక, శారీరక వత్తిడులను తట్టుకునేందుకు వ్యాయామం, యోగా చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పోలీసులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పోలీసు విధి నిర్వహణ అంటే మాటలు కాదు, అది కత్తిమీద సాములాంటిదని, ఎన్నో ఒత్తిడులు, ఒడిదుడుకులు ఉంటాయని, అయినా వాటినన్నిటినీ అధిగమించి పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తుంటారన్నారు.

మూడురోజుల పాటు ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణంలో ఈ క్రీడా పోటీలు నిర్వహించగా, పోలీసు క్రీడాకారులు హుషారుగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలలో ఏఎస్పీలు పరమేశ్వరరెడ్డి, జి.ఆంజనేయులు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డిఎస్పీలు ఎన్‌బిఎం మురళీకృష్ణ, రాఘవరెడ్డి, వివిఎస్ రాంబాబు, కె.రఘు, వి.ఆంజనేయులురెడ్డి, మల్లికార్జున, బాలసుందరం, శ్రీధర్, శ్రీనివాసాచారి, నగర ఇన్స్‌పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలతో పాటు పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# కార్తీకదీపాలతో భగవత్ కృప

**- శ్రీ శుకదేవస్వామి ఉద్బోధ**



కార్తీక దీపాలు వెలిగించి భక్తితో భగవంతుని ధ్యానించడం ద్వారా మనం దైవ కృపను పొందవచ్చని నెల్లూరులోని ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు శ్రీ శుకదేవస్వామి అన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఇటీవల ఇస్కాన్‌మందిరంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీకమాసం ఎంతో పుణ్యప్రదమైనదని, శ్రీకృష్ణ భగవానుడు తన భక్తివైభవాన్ని విశదపరచిన పలు లీలలు కార్తీకమాసంలోనే చోటుచేసుకున్నాయని వివరించారు. కార్తీకదీపం వెలిగించడం ద్వారా తమలోని అజ్ఞానాన్ని.. అంధకారాన్ని తొలగింపజేయాలని, భగవత్ వైభవాన్ని దర్శింపజేయాలని, ఆ విధంగా మాయ పరదా తొలగించాలని భక్తులు ఆ భగవంతుని ప్రార్థిస్తారన్నారు. దీపం జ్ఞానానికి, ఆనందానికి ప్రతీక అని, దీపం పురోగతికి సూచన అని అంటూ మానవుల్లోని అంధకారాన్ని తొలగించి హృదయానందాన్ని కలిగించేందుకు భగవన్నామ సంకీర్తన ఎంతో ముఖ్యమని, అందుకు 'హరే కృష్ణ' మహామంత్ర కీర్తన ఎంతో శ్రేష్టమైనదని ఉద్బోధించారు.

**డిఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో...**

# నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులు

కావలిలోని డా.డిఆర్ విశ్వోదయ సేవాసమితి నిర్వాహకులు ఈనెల 25వ తేదిన నిరుపేద వృద్ధులకు నెలసరి నిత్యావసరుకులు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కూనా తాతిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సుబ్బారావు మాట్లాడుతూ, సమాజంలో నానాటికీ మానవీయ విలువలు అడుగంటిపోతున్న నేటి కాలంలో విశ్వోదయ సేవాసమితి వారు నిర్భాగ్యులైన వృద్ధులకు ఇలాంటి సేవలు అందిస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. తాను కూడా విశ్వోదయ పూర్వ విద్యార్థినేనని అంటూ డా.డిఆర్ సేవాభావం మహోన్నతమైనదని అన్నారు. 40వ వార్డు కౌన్సిలర్ రాము మాట్లాడుతూ, డా. డిఆర్ సేవలు మహనీయమైనవని, వారు ఎంతోకాలం నుంచి ఇలా సమాజసేవ చేసేవారని, ఇప్పుడు వారి తనయులు ఆ సేవలను కొనసాగించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం 63మంది పేదలకు అతిథుల చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి.వినయ్‌కుమార్‌రెడ్డి, డి. మనోహర్‌రెడ్డి, జె.కృష్ణప్రసాద్, శ్రీమతి జ్యోతిశ్రీ, నల్లూరి రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**రిజర్వేషన్లు అమలుచేయాలంటూ**

# దివ్యాంగుల ర్యాలీ



తమకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని, పంచాయితీ నుంచి పార్లమెంట్ దాకా ఆ రిజర్వేషన్లు అమలుచేయాలని, అంతే కాక నామినేటెడ్ పదవుల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అవకాశం కల్పించాలంటూ శారీరక దివ్యాంగ సంఘాల ఐక్యవేదిక జెఏసి ఆధ్వర్యంలో ఈనెల 26న నెల్లూరులో మూడుచక్రాల స్కూటర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎబిఎం కాంపౌండ్ వద్ద నుంచి విఆర్‌సి సెంటర్, డా.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. దివ్యాంగుల న్యాయబద్ధమైన కోర్కెలను, ప్రభుత్వం తమకిచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజైన డిసెంబర్ 3వ తేదిన రాష్ట్రప్రభుత్వం ఆ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆవుల నాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు గూడూరు వెంకటరమణయ్య, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చీర్ల బాబు, నాయకులు తాటిపర్తి అంకయ్య, దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కంబవు పెంచలయ్య, వెంటా శ్రీనివాసులు, ఎస్‌కె అల్తాఫ్, మురళి, వోసూరి సాంబయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# సాయిరెడ్డితో రామ్ భేటి

వైఎస్సార్సీపి జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి నెల్లూరులోని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్ళి రామ్‌కుమార్‌ను కలుసుకున్నారు. వైఎస్సార్సీపి తిరుపతి, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడుగా ఉన్న రామ్‌కుమార్‌రెడ్డితో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను, పార్టీ స్థితిగతులను, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే దిశగా చేపట్టాల్సిన అంశాలను చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో వెంకటగిరి పోలేరమ్మ ఆలయం ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ పులి ప్రసాద్‌రెడ్డి, అల్లూరుపాడు సొసైటీ అధ్యక్షుడు పాదిలేటి దశరథరామిరెడ్డి, నాయకులు పల్లెపాటి రవీంద్రరెడ్డి, తీర్థంపాడు జగన్మోహన్‌రెడ్డి, చింతపట్ల మురళి, మల్లి, శ్రీహరికోట కృష్ణయ్య పాల్గొన్నారు.

### విజయసాయిరెడ్డిని ఘనంగా సన్మానించిన విద్యార్థి నాయకులు

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి ఈనెల 28న నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సిపి విద్యార్థి విభాగం నాయకుడు శ్రావణ్ ఆధ్వర్యంలో విజయసాయిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థివిభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె హాజీ, నాయకులు హరికృష్ణయాదవ్, కమల్, సురేష్, వినీల్, వంశీ, నరేష్, నిఖిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం!

**డా.బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**



భారత రాజ్యాంగనిర్మాత డా.బిఆర్ అంబేద్కర్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ నెల 26న నెల్లూరులోని డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద 69వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి అంబేద్కర్ సేవలను ప్రస్తుతించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, దానిని ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత డా.అంబేద్కర్‌కు దక్కిందని, ఇంతటి పవిత్రమైన రాజ్యాంగాన్ని నేడు బిజెపి ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేయడం తగదని అన్నారు. ఎన్నో సంస్కరణలు ప్రతిపాదించిన డా. అంబేద్కర్ ఫోటోను కరెన్సీనోట్లపై ముద్రించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేయకపోవడం దురదృష్ట కరమన్నారు. జిల్లా ఎస్సీఎస్టీ విభాగాల అధ్యక్షుడు శీలం తిరుపయ్య, నాయకులు దార్ల సునీల్‌రాజు, ఆర్‌వి రమణయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నాయకులు సివి శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, రఘురాం ముదిరాజ్, సుమన్, ఫయాజ్, శివప్రసాద్, గిరీష్, గోపాల్, అంజి, విజయ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన దామోదర్



గీతాంజలీ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ట్రిపుల్ ఇ విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న బి.దామోదర్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో తృతీయ బహుమతి సాధించి సత్తా చాడాడని కళాశాల ప్రిన్సిపల్ డా. జి. సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఈనెల 27న నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న ఇస్కాన్ సిటీలో నిర్వహించిన అంతర్ జిల్లా జూడో పోటీల్లో దామోదర్ ప్రథమ స్థానం సాధించి ఈనెల 24 న నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించాడన్నారు. కళాశాల డైరెక్టర్ ఎన్ వియల్ ఎన్ కుమార్, అధ్యాపక బృందం, సాంకేతిక సిబ్బంది, వివిధ విభాగాధిపతులు విజేతను అభినందించారు..

## నిద్రలో కూడా...
# రైతుల గురించే!
### - సోమిరెడ్డి ప్రేమ


సిమెంట్‌రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తాను నిద్రలో కూడా సర్వేపల్లి నియోజకవర్గ రైతులకు ఇంకా ఏం చేస్తే బాగుంటుందా అని ఆలోచిస్తుంటానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 26వ తేదీ మనుబోలు మండలం కొమ్మలపూడిలో 'గ్రామదర్శిని – గ్రామ వికాసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ 15.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో అమర్చిన ఎల్‌ఇడి లైట్లను స్విచ్ఛాన్‌చేసి వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల దశాబ్దాల కల అయిన బండేపల్లి కాలువకు నిధులు తెచ్చానని, త్వరలోనే టెండర్లు పిలిచి జనవరిలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఆమంచర్ల వద్ద కనుపూరు కాలువ విస్తరణకు చర్యలు చేపట్టామని చెప్పారు. చవటపాళెం, కొమ్మలపూడి రోడ్డుకు 68లక్షలు మంజూరు చేయించానని, 28లక్షలతో చెక్‌డ్యాం మంజూరు చేయించడం జరిగిందని చెప్పారు. కొమ్మలపూడిలో 60.50లక్షలతో 12సిమెంట్‌రోడ్లు నిర్మించామని, నీరు, ప్రగతి పథకంలో 90.50లక్షలతో నీటిపారుదల ఆధునీకరణ పనులు చేసామని ఆయన తెలిపారు.

## నాయీబ్రాహ్మణులకు...
# అండగా నిలుస్తాం!
### - నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్




నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని, వారికి నావంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని, నగరంలో అర్హులైన నాయీబ్రాహ్మణ సంఘీయులకు పక్కాఇళ్ళ మంజూరుకు తనవంతు సహకారం అందిస్తానని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 27న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన నాయీబ్రాహ్మణుల వనభోజన మహోత్సవాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్సీపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే నాయీబ్రాహ్మణుల కష్టాలు తీరుతాయని, వారి సమస్యల పరిష్కారానికి, వారి రాజకీయ ఎదుగుదలకు కూడా తనవంతు కృషి ఉంటుందని చెప్పారు. నగరంలోని 9వ డివిజన్‌లో నాయీబ్రాహ్మణులు అధికసంఖ్యలో ఉన్నారు కనుక అక్కడ కార్పొరేటర్‌గా ఆ సంఘీయులకు అవకాశం కల్పిస్తామని, నగరంలోని ప్రముఖ ఆలయాల్లో ఏదో ఒకదానికి పాలకమండలి ఛైర్మెన్‌గా కూడా అవకాశం కల్పించేందుకు కృషిచేస్తానని అన్నారు. నాయీబ్రాహ్మణ సేవాసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా సేవాసంఘం వ్యవస్థాపకుడు కిన్నెర మాలకొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జాతీయ అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. నుడా డైరెక్టర్ ఖాజావలి, బిసి కులాల బహుజన ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు బాషా, నాయీబ్రాహ్మణసంఘం నాయకులు నాదెండ్ల సూర్యప్రకాశ్‌రావు, సుభాషిణి, చిరంజీవి, రామారావు, సుబ్బన్న, శ్రీనివాసులు, బుజ్జయ్య పాల్గొన్నారు.

# లంచమంటే... మెడలు వంచుతా!
### - అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



అక్రమాలకు పాల్పడడమో, లంచాలు తీసుకోవడమో చేస్తే అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను హెచ్చరించారు. ఈ నెల 25న గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో ఆయన తన క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మర్రిపాడు ఎ.ఇపై పలు ఆరోపణలు రుజువైనందువల్ల ఆయన్ను విధుల నుండి తప్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించినా, నిబంధనలు అతిక్రమించినా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గృహనిర్మాణశాఖలో అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుని త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని, వచ్చే ఫిబ్రవరి నెలాఖరునాటికి లక్ష్యాలను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ అధికారి ప్రసాద్, ఎ.ఇ సాయి రామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం-పరిశుభ్రతకు...
# శ్రీసిటీ కృషి అభినందనీయం
### - గ్రీన్‌ప్రాజెక్ట్ ఎం.డి మేకా విజయసాయి ప్రశంస



శ్రీసిటీలో పచ్చదనం పరిశుభ్రతకు లోటులేదని, అందుకోసం ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమైనవని ఐజిబిసి అమరావతి చాప్టర్ ఎస్ఎస్ గ్రీన్ ప్రాజెక్ట్స్ ఎం.డి మేకా విజయసాయి కొనియాడారు. 'స్మార్ట్ నగరాల్లో స్మార్ట్ భవనాలు' అనే అంశంపై ఈ నెల 27న శ్రీసిటీలో వర్క్‌షాప్ జరిగింది. ది కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియాన్ ఇండస్ట్రీ, ఇండియన్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్, స్వీడన్–ఇండియా బిజినెస్ కౌన్సిల్, శ్రీసిటీ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ఇందులో పాల్గొన్న స్వీడన్ ప్రభుత్వ అధికారి ఆల్బిన్ కార్లెస్, స్వీడిష్ స్మార్ట్ గ్రిడ్ ఉన్నతాధికారి మరియా సాన్డక్విస్ట్ మాట్లాడుతూ స్మార్ట్‌బిల్డింగ్ టెక్నాలజీల ద్వారా భవనాల సామర్థ్యం, భవనాల లోపల పర్యావరణ నాణ్యత ఎలా పెంపొందుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సుమారు 7500 ఎకరాల విస్తీర్ణం కలిగి, ఐజిబిసి సంస్థ గ్రీన్‌సిటీ గోల్డ్‌రేటింగ్ సాధించిన గ్రీన్‌ఫీల్డ్ నగరాల్లో శ్రీసిటీ ఒకటని, శ్రీసిటీ ప్రారంభదశ నుంచే పరిశుభ్రత పచ్చదనానికి, చక్కని పారిశ్రామిక నగర సముదాయాన్ని అందించే స్థిరమైన పర్యావరణ వ్యవస్థలను నెలకొల్పడానికి తాము నిబద్ధతతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ వర్క్‌షాప్ ద్వారా పరిశ్రమల యాజమాన్యాలకు లాభం చేకూరుతుందని, గ్రీన్‌బిల్డింగ్, స్మార్ట్‌సిటీ కార్యక్రమాల అమలుకు వీలు కల్పించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యమని ఆయన వివరించారు. స్వీడన్ నుంచి భవిష్యత్ గ్రీన్ టెక్నాలజీలపై అవగాహన కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతీయ ప్రాజెక్టులలో అమలుచేయడానికి ఆ రంగంలో నిపుణులతో చర్చించడమే దీని ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ టెక్నాలజీలో భాగంగా స్వీడిష్ కంపెనీల వారితో రసాయన రహిత వాషింగ్, శక్తి నిల్వ, స్మార్ట్‌మీటరింగ్, లైట్ అర్బన్ వాహనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, స్వీడన్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ వైస్‌ప్రెసిడెంట్ ఆరతి దేవిస్, ఐజిబిసి ప్రిన్సిపల్ కౌన్సిలర్ కార్తికేయన్ పాల్గొన్నారు.

## ద్రోహం చేసినవాళ్ళే...
# న్యాయం చేస్తారంట!
### ఆనందపడుతున్న కాంగ్రెస్ నేతలు



రాష్ట్ర విభజన పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రజలను అనాధలను చేసింది కాంగ్రెస్ పార్టీయే! ఆరోజు సోనియాగాంధీ, ఆమె కొడుకు రాహుల్‌గాంధీలు ఆంధ్రా పట్ల ఒక్క శాతం కూడా దయ చూపలేదు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులు, రోహింగ్యాల మీద చూపించే ప్రేమను కూడా ఆంధ్రులపై చూపలేదు. తెలుగువాడు అనే ఏ ఒక్కడు కూడా చరిత్రలో సోనియాగాంధీని క్షమించడు. ఆంధ్రుల ఘోష్ట తగిలే 2014 ఎన్నికల్లో చరిత్ర హీనంగా 47సీట్లకు పడిపోయారు. అలాంటి సోనియా, రాహుల్‌లు ఇప్పుడు ఆంధ్రాపై ఎనలేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇస్తామంటూ తెలంగాణ ఎన్నికల సభలో ప్రకటించారు. వాళ్ళు అక్కడ ప్రకటించగానే నెల్లూరు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశం పెట్టి చప్పట్లు కొట్టుకుని సంబరపడ్డారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, సి.వి.శేషారెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, శీలం తిరుపయ్య, రఘురాం ముదిరాజ్, టి.బాలసుధాకర్ తదితరులు విలేకరుల సమావేశం పెట్టి మేడ్చల్‌లో జరిగిన ఎన్నికల సభలో తాను ప్రధాని అయితే ప్రత్యేక హోదాపై తొలిసంతకం చేస్తానని రాహుల్ ప్రకటించారని, కాబట్టి మనమంతా కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఇప్పటిదాకా ఆదరించిన దానికి చేయాల్సిన ద్రోహం చేశారు. ఇంకోసారి ఆదరిస్తే వున్న ఊపిరి కూడా తీస్తారేమో?!

# మధురం... శివనామస్మరణం

## • భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు



కార్తీక మాసం మూడవ సోమవారం శివుని జన్మనక్షత్రం ఆరుద్ర కావడంతో జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆదిదంపతులకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని మీనాక్షీ సుందరేశ్వరస్వామి, నవాబుపేటలోని భ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామి, ఉస్మాన్ సాహెబ్ పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సంతపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, వహాబ్‌పేట ఉమా మహేశ్వరస్వామి తదితర దేవస్థానాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# క్రీడలను ప్రోత్సహిద్దాం!

### - మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల క్రీడాకారులకు నెల్లూరు వేదిక కావడం అభినందనీయమని మాజీ మంత్రి, వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్ సీపీ సమన్వయకర్త ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఇన్‌ఫాంట్ జీసెస్ స్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలను ఈనెల 24న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడంలో నెల్లూరుకు విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు రామనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఆనం రాంకిషోర్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పసుపులేటి రామ్మూర్తి, అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యండి ముసవీర్, వెంకట శశిధర్, డాక్టర్ ప్రభాకర్, కోశాధికారి డాక్టర్ సీవీ సురేష్. రాష్ట్ర చీఫ్ కోచ్ శేషగిరి పాల్గొన్నారు.

---

## గూడూరు డివిజన్ వార్తలు

### విద్యుత్ రంగం పట్ల...

# అధ్యాపకులకు అవగాహన

### ఎన్‌బికెఆర్‌లో 5రోజుల శిక్షణా కార్యక్రమం



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు 5 రోజుల పాటు షార్ట్‌టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్–కలకత్తా వారి ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన ఇంజనీర్ ఎ.కె రవీంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎలక్ట్రిసిటీ రూల్స్ అండ్ ప్రాక్టీసెస్ అనే అంశంపై కలకత్తాకు చెందిన ఎన్ఐటి టిటిఆర్ ప్రొఫెసర్ ప్రశాంత్ సర్కార్ పాల్గొని అధ్యాపకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలోని విద్యుత్ రంగంలో ఉన్న వివిధ ప్రమాణాలను ఐటిఏ, ఐఆర్ఏ, ఈఏ–2003 అనే అంశాలను విశదీకరించారు. ఈ ప్రమాణాలను పాటించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించగలుగుతున్నామని, వీటికి చట్టబద్ధత ఉందని పేర్కొంటూ విద్యుదుత్పత్తి – విద్యుత్ సరఫరాలో వివిధ ప్రామాణికాల నియమాల గురించి, విద్యుత్ సంస్థల్లో చార్జీల నియంత్రణ, సబ్సిడీలు వగైరాల గురించి కూడా వారు ఈ సందర్భంగా వివరించారు. కళాశాలలోని ఎలక్ట్రికల్ విభాగం అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయా అంశాలపై అవగాహన పొందారు. కళాశాల సంచాలకులు డా.విజయకుమార్‌రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగం అధిపతి డా. ఎస్.సతీష్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాధరెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఇ.వినోద్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఎంపిడివో ఆధ్వర్యంలో..

# రాజ్యాంగ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపిడిఓ అన్నపూర్ణారావు

గూడూరు ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడిఓ అన్నపూర్ణరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఈ నెల 26న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ న్యాయం చేకూరాలన్న ఉద్దేశ్యంతో రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసిపిని గెలిపించండి

### - మేరిగ మురళి



రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైకాపాని ఆశీర్వదించి, జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపిస్తే పేదలకు మేలు జరుగుతుందని వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి తెలిపారు. గూడూరు పట్టణంలోని 7వ వార్డులో 'రావాలి జగన్ – కావాలి జగన్' కార్యక్రమాన్ని సోమవారం వైకాపా నాయకులతో కలసి నిర్వహించారు. ముందుగా నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మేరిగ మురళి మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించడమే జగనన్న లక్ష్యం అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని, తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులుయాదవ్, సుభాన్, సునీల్‌రెడ్డి, బిక్కు సాహెబ్ తదితరులున్నారు.

# దేవాలయాన్ని అభివృద్ధి చేశాం

### - కమిటి చైర్మెన్ శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వాటంబేడు శివకుమార్

శ్రీ కృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థాన కమిటి దేవాలయ చైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుండి నేటి వరకు దేవాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ధర్మరాజుల స్వామి దేవస్థానంలో 26వ తేదీ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ద్రౌపది దేవి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ఉభయదాతలు, సొంత నిధులు వెచ్చించి దేవాలయంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ నెల 30న కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

### లార్జెస్ట్ కరాటేలో..

# జయసూర్య ప్రతిభ



జయసూర్యని అభినందిస్తున్న ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

కావలిలో నిర్వహించిన 'లార్జెస్ట్ కరాటే కటా' పోటీల్లో గూడూరు పట్టణానికి చెందిన జయసూర్య ప్రతిభ కనబర్చినందుకు జిల్లా ఎస్పి ఐశ్వర్యరస్తోగి బాలుడ్ని ప్రత్యేకంగా అభినందించారని శ్రీచైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఈ నెల 26వ తేదీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి కరాటే పోటీల్లో రికార్డు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఏజిఎం శ్రీకాంత్, డీన్‌లు శ్రీహరి, గాంధీ, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి తదితరులు అభినందించారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని నీరు గారుస్తున్నారు

### గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న మానవత అధ్యక్షులు మునిరాజా

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు మునిరాజా మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని నేడు ఎవ్వరూ పట్టించుకోకపోవడం వలనే అవినీతి, అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. మానవత సంస్థ చైర్మెన్ బి.దశరథరామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రతిఒక్కరు ఆర్థిక, లౌకిక, నైతిక రంగాల్లో అభివృద్ధి చెందేందుకు సరైన మార్గంలో నడిపించే మార్గ నిర్దేశమే రాజ్యాంగం యొక్క గొప్పతనమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఆనాటి మేధావులు, త్యాగధనులు ఏర్పరచిన విధివిధానాలు నేడు పూర్తిగా కనుమరుగైపోతున్నాయని ఆవేదన చెందారు. యువత దేశాభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డబ్ల్యూ ప్రిన్సిపాల్ భారత లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.


# రెగ్యులర్ షోలను ఆపేసిన కామెడీ ఛానల్స్




ప్రపంచ దేశాధినేతలకే రాజకీయ పాఠాలు నేర్పించే హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు నివాసానికి 30కిలో మీటర్ల దూరంలో వున్న విజయవాడ నగరం. భవానీపురంలోని ఎకసెక్కాల వెంకట్రావు ఇల్లు. వెంకట్రావ్ అప్పుడే బయట పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రిలాక్స్‌డ్‌గా సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేశాడు. తనకు ఇష్టమైన జెమిని కామెడీ ఛానల్ పెట్టాడు. ఆశ్చర్యం... ఆరోజు కామెడీ సీన్‌లు ప్రసారం కావడం లేదు. అంతలో వెంకట్రావ్ కొడుకు బంటీ వచ్చి డిస్నీ ఛానెల్ పెట్టాడు టామ్ అండ్ జెర్రీ చూద్దామని... కాని, దాంట్లోనూ ఏమీ రావడం లేదు. అంతలో కూతురు పింకీ వచ్చి కార్టూన్ ఛానెల్ పెట్టింది 'డోరేమాన్' చూద్దామని, కాని దాంట్లోనూ ఏమీ రావడం లేదు. వంటింటిలో నుండి వెంకట్రావ్ భార్య పంకజం వచ్చి 'మొగలి రేకలు... మొగుడి కేకలు' సీరియల్ చూద్దామని 'జీ తెలుగు' ఛానెల్ పెట్టింది. ఆ ఛానల్‌లోనూ సీరియల్స్ ఆపేసి వున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్స్ అన్నీ ఎందుకు ఆపేసారో వెంకట్రావ్‌కు అర్థం కావడం లేదు. కనీసం న్యూస్ ఛానల్స్ అన్నా వస్తున్నాయో లేదో అని చెప్పి 'చంద్రజ్యోతి' ఛానల్ పెట్టాడు. అప్పుడే ఆ ఛానల్ స్క్రీన్‌పై ఫ్లాష్ న్యూస్‌లో... 'మరికొద్ది సేపట్లో నారా లోకేష్ విలేకరుల సమావేశం', 'తమ కుటుంబ ఆస్తులను ప్రకటించనున్న లోకేష్', 'తమ రెగ్యులర్ ప్రసారాలను ఆపేసి లోకేష్ ప్రెస్‌మీట్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయనున్న కామెడీ, ఎంటర్ టైన్‌మెంట్ ఛానెల్స్...' స్క్రీన్‌పై ఈ ఫ్లాష్ న్యూస్ చూసాక వెంకట్రావ్‌కు విషయం అర్థమైంది. లోకేష్ ఆస్తులను ప్రకటిస్తున్నాడట... అంతకంటే కామెడీ సీన్ ఇంకోటి వుండదు. ఆయన ఆస్తులు ప్రకటించేటప్పుడు వేరే ఛానెల్స్‌ను జనాలు చూడరు... అందుకే అన్ని ఛానెల్స్ వాళ్ళు టిఆర్‌పి రేటింగ్ కోసం ఆయన ప్రెస్ మీట్‌నే ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని భార్య పంకజంకు చెప్పాడు. అంతలో లోకేష్ రావడం, ప్రెస్‌మీట్ స్టార్ట్ చేయడం జరిగింది.

అమరావతిలోని తన ఛాంబర్‌లో లోకేష్ ప్రెస్‌మీట్ మొదలుపెట్టి... ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మా ఆస్తులను ప్రకటించాలని మిమ్మల్ని అందర్నీ పిలిపించాను. నేనుగాని, మా నాన్నగారు గాని నీతి, నిజాయితీలకు కేరాఫ్ అడ్రస్‌గా వుంటాము. పాలు, కూరగాయలు అమ్ముకోవడం మా ప్రధాన వ్యాపారం. ఈ వ్యాపారంలో అప్ అండ్ డౌన్‌లు వుంటుంటాయి. కాబట్టి ఆస్థుల విలువల్లో హెచ్చుతగ్గులుంటుంటాయి. హైదరాబాద్‌లో ఒక ఇల్లు లక్షా నూట పదహారు రూపాయలు, నారావారిపల్లెలో ఇల్లు విలువ 10,116 రూపాయలు, ఇక ఇంట్లో ఒక బీరువా, సామ్‌సంగ్ సింగిల్ డోర్ సెకండ్‌హ్యాండ్ ఫ్రిజ్ విలువ 2వేలు, ఒక బీరువా 1500, రెండు ఫ్రేమ్ మంచాలు, రెండు నులకమంచాలు, ఒక ఫైబర్ డైనింగ్ టేబుల్, ఇండెస్టన్ గ్యాస్ స్టౌవ్, హెచ్‌పి సిలిండర్లు 2, ఉషా సీలింగ్ ఫ్యాన్‌లు 3, దయనోరా బ్లాక్ అండ్ వైట్ టీవీ 1983 మోడల్ ఒకటి, 1987 మోడల్ హీరో ర్యాలీ సైకిల్ ఒకటి, అన్నం తినే స్టీలు గిన్నెలు ఐదు, నీళ్ళు తాగే గ్లాసులు 10, టీ తాగే గ్లాసులు 15, చెంబులు 2, అన్నం వండుకునే అల్యూమినియం దబర్లు 4, నీళ్ళు కాసుకునే గంగాలం ఒకటి, నాకు 8 చొక్కాలు, 6 ఫ్యాంట్లు, 4 జాకీ డ్రాయర్‌లు, 4 రామ్ రాజ్ బనియన్‌లు మొత్తం ఆస్తి విలువ రెండు కోట్ల ఏడు లక్షలు... మా దేవాన్ష్ ఆస్థి విలువ 18కోట్లు... అని చెప్ప సాగాడు. అప్పుడు 'మనస్సాక్షి టీవీ' విలేకరి ధర్మానంద వుండి సార్, దేవాన్ష్ బాబు ఆస్తులు అంతగా ఎలా పెరిగాయని అడిగాడు. అందుకు లోకేష్... దేవాన్ష్ ప్యాకెట్ పాలు తాగడం మానేసాడు, అతను తాగకుండా మిగిలిన పాలను మార్కెట్‌లో అమ్మేయగా వచ్చిన డబ్బును అతని ఖాతాలోనే జమ చేస్తున్నాం... ఇలా మిగిల్చిన పాల ద్వారా వచ్చిన ఆస్తే 18కోట్లు అయ్యిందని చెప్పాడు. దేవాన్ష్ మిగిల్చిన పాల ద్వారానే ఇన్ని కోట్ల ఆస్థి వచ్చిందంటే ఇక మీ తండ్రి చంద్రబాబు మిగిల్చిన పుడ్డు ద్వారా ఇంకెన్ని కోట్ల ఆస్థి పెరిగి వుంటుందోనని ఏబిసి ఛానెల్ విలేకరి సూది సుబ్బారావు అడిగాడు. దానికి లోకేష్... ఆయనకు అంత సీన్ లేదు, మా ఇంట్లో దండగ తిండి తినేది మా నాన్నగారే... ఇంట్లో అందరం పాలు, కూరగాయలు అమ్మే వ్యాపారం చేస్తాం, మా నాన్నగారే ఎప్పుడూ ప్రజలు, ప్రజా సేవ అంటూ ఊర్లు పట్టి తిరుగుతుంటాడు. ఈమధ్య కొత్తగా ఇంకోటి నేర్చుకున్నాడు. దేశ ప్రయోజనాలంటూ దేశం పట్టి తిరుగుతున్నాడు. మా ఇంట్లో రూపాయి ఆదాయం లేకుండా వుండే మనిషి ఆయనే. కాబట్టి గత ఏడాది కంటే ఈ ఏడాది ఆయన ఆస్తులు బాగా తగ్గాయి అని చెప్పి... ప్రతి ఏటా మేం మా ఆస్తులను నిజాయితీతో ప్రకటించి పారదర్శకత చాటుకుంటున్నాం. దేశ రాజకీయాలలో ప్రతిఒక్కరూ మమ్మల్ని ఆదర్శంగా తీసుకుని ఆస్తులను ప్రకటించుకోవాలని చెప్పి ప్రెస్‌మీట్ ముగించాడు.

ఎకసెక్కాల వెంకట్రావ్ భార్య పంకజం వుండి భర్తతో... ఈ ప్రోగ్రామ్ భలే వుంది కదండీ... "పెళ్లాం వదిలేసిన మొగుడు" సీరియల్ కంటే బాగుంది. ఆ యాంకర్ అబ్బాయి కూడా భలే నవ్వించాడు. పిల్లలు కూడా చాలా ఇంట్రస్ట్‌గా చూసారు. ఈ ప్రోగ్రామ్ ప్రతిరోజూ ఇదే టైంకు వస్తుందా? ఖచ్చితంగా ఆ టైంకు చూస్తాం అని అడిగింది. పంకజం మాటలు విన్న వెంకట్రావ్‌కు... అది ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రాం కాదని, లోకేష్ ఆస్తుల వివరాలు వెల్లడించే ప్రెస్‌మీట్ అని చెప్పి నమ్మించేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది.



# త్యాగధనుల కలలకు సాకారం.. స్త్రీ విద్యకై ఆవిర్భవించిన ప్రాకారం




*గత మూడు వారాలుగా 'ఇదీ కస్తూరిదేవి కథ' పేరుతో వస్తున్న వాస్తవ అక్షర కథనాలకు విశేష స్పందన లభిస్తోంది. సుమారు 90సంవత్సరాల క్రితం మొదలైన ఈ విద్యాలయం చరిత్రని పూసగుచ్చినట్లు 'లాయర్' పాఠకులకు అందిస్తూ... అవసరమైన సాక్ష్యాధారాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ నిజానిజాలను నెల్లూరీయులకు తెలియజేసే క్రమంలో ముందుకు సాగుతోంది మా(మీ) 'లాయర్'. ఎందరో త్యాగమూర్తులు మహోన్నత ఆశయాలతో ఎన్ని కష్టాలు ఎదురైనా జంకకుండా ఈ సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డారు. 9దశాబ్దాల చరిత్ర కలిగిన సంస్థను, సంస్థ ప్రతిష్టని అప్రతిష్టపాలు చేయడం ఏ ఒక్కరి తరమూ కాదు. పటిష్టాత్మక శాసనాలతో కట్టుదిట్టమైన నిర్ణయాలతో రూపొందిన సంస్థ నియమనిబంధనల ప్రకారం సంస్థ ఆస్తులను పరులపాలు చేయడం ఎవరికీ సాధ్యమయ్యే పని కాదు. ఈ కమిటి ఏ చర్య తీసుకున్నా అది సంస్థ అభివృద్ధి కోసం దోహదపడాలే తప్ప, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎలాంటి నిర్ణయం తీసుకోరాదు. ఇలాంటి అనేక కఠినమైన నిర్ణయాలతో కూడిన బైలాస్‌ను ఆనాటి కమిటి సభ్యులు రూపొందించారు. నాటి ఆ మహనీయుల ఆలోచనలు, ఆశయాలు, నిర్ణయాలు 'లాయర్' పాఠకుల కోసం అందిస్తున్నాం.*

**స్త్రీ విద్యకు ఎలాంటి వసతులు లేని నాటి రోజుల్లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలైన శ్రీమతి పొణకా కనకమ్మ గారు, మరికొందరు మహనీయులు అందరూ కలసి బాలికాభ్యున్నతి కోసం ఎన్నెన్నో వ్యయప్రయాసలు పడి శ్రీ కస్తూరిదేవి విద్యాలయాన్ని స్థాపించారు. జిల్లాలో స్త్రీవిద్యకు నారు వేసి నీరు పోసింది వారే. అందుకు ఆనాడు వారెన్నో కష్టాలు కూడా ఎదుర్కొన్నారు. ఎందరో మహానుభావుల కృషి, వదాన్యుల సహకారంతో ఈ సంస్థ నానాటికీ అభివృద్ధి చెందుతూ జిల్లాకే తలమానికంగా నిలిచిందంటే అదంతా ఆ మహనీయుల కృషి వల్లనేనని వేరే చెప్పనక్కర లేదు. అప్పట్లో ఈ కమిటీకి అధ్యక్షులుగా ఉన్న వదాన్యులు శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు ఈ పాఠశాల కోసం ఉదారంగా అప్పట్లోనే 50వేల రూపాయలు (ఇప్పుడు ఎన్ని కోట్ల విలువో చెప్పలేం) విరాళం అందజేశారంటే ఎంత గొప్పవిషయమో చూడండి!.. పాఠశాల అభివృద్ధికి ఆ నిధి ఎంతగానో దోహదపడింది. విద్యాలయం పూర్వచరిత్రలో ఈ వివరాలన్నీ ఎంతో స్పష్టంగా ఉన్నాయి.**

## శ్రీ కస్తూరిదేవి కమిటీ యొక్క అధికారములు :

1. (ఏ) సంస్థ యొక్కగాని, సంస్థల యొక్కగాని ధనము-స్థిర చర ఆస్తులపైన కమిటీకి అధికారము కలిగియుండవలయును. సదరు ఆస్థి కమిటీకి చెందినది.

(బి). తనకు అవసరమని తోచినటుల సంస్థయొక్క నిధిని గవర్నమెంటువారిచే అంగీకరింపబడిన యెట్టి సొసైటీలోగాని, మరి యే సంస్థలలోగాని నిలువచేయుటకు సర్వాధికారమున్నది.

(సి) సంస్థ పురోభివృద్ధి దృష్ట్యా కార్యకలాపములు గావించుటకు, సంస్థకు సంబంధించిన నిధి, ఆస్తుల సక్రమ నిర్వహణ, సమర్ధనీయమైన పరిపాలన విషయంలో కమిటీకి సర్వాధికారము కలదు.

(డి) నిర్ధేశింపబడిన లేక తన ఆధ్వర్యాన నిర్ధేశింపబడనున్న ఆదేశములను అమలుజరుపుట, అజమాయిషీ చేయుటల్లో కమిటీ సంపూర్ణ అధికారము కలిగియుండును.

(ఇ). ఉపాధ్యాయులను, తక్కిన సిబ్బందిని నియమించుటకు, యెవరెవరు యేయే పనులను నిర్వర్తించవలసినది గూడా నిర్ణయించుటకు అధికారము కలిగియుండవలయును. ఉపాధ్యాయబృందము యొక్క, తక్కిన సిబ్బందియొక్క పరిస్థితుల కనుగుణ్యంగా జీతము నిర్ణయించుట, మార్పు చేయుట, స్కేళ్లను మార్చుటను కమిటీ నిర్వర్తించును.

(ఎఫ్). అవసరమైనప్పుడు సిబ్బందిపై క్రమచర్య తీసుకొనుటకు అధికారము కలిగియుండును.

(జి) సంస్థ చక్కగా నడచుటకు అవసరమైన బైలాలను, చట్టములను చేయుటకు కమిటీకి అధికారము కలిగియుండును.

(హెచ్) ఇదివరలో తాము చేసిన చట్టములను, బైలాలను, నిబంధనలు మొదలగువాటిని అవసరమైనప్పుడు రద్దు చేయుటకు గాని, తాత్కాలికముగా నిలుపుటకు గాని, వాటిలో మరికొన్నిటిని చేర్చుటకు గాని అధికారము ఉండును....

ష.రా: అయిదుమంది సభ్యులకు తక్కువుగా కాకుండా హాజరైన కమిటి వారిచే గావింపబడు ప్రతి చర్య గాని, ప్రొసీడింగ్స్ గాని, చట్టసమ్మతముగా యుండును.

## కమిటీ కార్యకర్తల బాధ్యతలు:

**2. (ఏ) అధ్యక్షుని అధికారములు, వారు నెరవేర్చవలసిన విధులు :**

అధ్యక్షుడు తాను హాజరైన ప్రతిసభకు ఆధిపత్యం వహించవలయును. సంస్థ యొక్క పరిపాలన, దాని విధానములపై సర్వాధికారము కలిగియుండవలయును. అధ్యక్షుడు హాజరుకాని సభకు, అప్పుడు హాజరైన సభ్యుల్లో ఒకరిని సదరు సభకు ఆధిపత్యము వహించుటకు ఎన్నుకొనవలయును. అట్లు తాత్కాలికముగా ఎన్నుకొనబడిన సభ్యునికి ప్రస్తుతమునకు అధ్యక్షునికి ఉన్న అధికారములుండును.

**(బి) కార్యదర్శి అధికారములు.. వారు నెరవేర్చవలసిన విధులు :**

1. కమిటీని సమావేశపరచుటకు అధికారము ఉండవలయును. బడ్జెటు మీటింగుకు ఏడుదినముల వ్యవ ధియు, సాధారణ సభకు మూడు దినముల వ్యవధియు ఉండవలయును. సదరు మీటింగు నోటీసులో చర్చించబడు అంశముల జాబితా చేర్చబడవలయును. సభ జరుగుచుండునప్పుడు ఏ సభ్యుడు గాని చర్చకు సంబంధించిన రికార్డులు కావలయునని కోరిన, సదరు రికార్డు ఇవ్వవలయును. కార్యదర్శి లేని సమయయులో అధ్యక్షుడు గాని, వారి ఉత్తర్వు పొందిన ఇతర సభ్యుడుగాని సభ్యుల సమావేశమునకు తాఖీదు పంపవలయును. అధ్యక్షుడుగాని, లేక ఏ ముగ్గురు సభ్యులుగాని ఏదైనా ముఖ్యమైన విషయము, లేక విషయములు చర్చించుటకు సభ్యుల సమావేశము జరుపమని వ్రాతమూలకముగ తెలియజేసేపక్షమున, కార్యదర్శి అట్టి సమావేశము ఏర్పాటు చేయవలయును.

2. సమావేశము యొక్క తీర్మానములన్నింటిని రికార్డు చేసి పెట్టవలయును.

3. కమిటీకి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుచుండవలయును.

4. జమ, ఖర్చులకు జవాబుదారిగా యుండవలయును.

5. సంస్థకు సంబంధించిన యావత్తు ఆస్తికి జవాబుదారిగానున్నూ, కరస్పాండెంట్‌గానున్నూ యుండవలయును.

6. కమిటీవారు కోరిన ప్రతి విషయమునకు సంజాయిషీ ఇవ్వవలయును.

7. సంస్థ యొక్క సిబ్బంది మీద అవసరంగా క్రమచర్య తీసుకొనవలసి వచ్చినప్పుడుగాని, తాత్కాలికంగా ఎవరినైనా ఉద్యోగంలో అవసరంగా ఉంచుటకుగాని, కమిటీ సభ్యులను సమావేశపరచి వారి అనుమతి పొందుటకు కాలయాపన కలుగను కావున, కార్యదర్శి అట్టి సందర్భములలో, కమిటీ తరఫున తానే ఉత్తరువులను జారీచేయుటకు అధికారం ఉండవలయును. ఇది మరుసటి కమిటీ సమావేశములో మంజూరు కావలసి యుండును.

8. అత్యవసరమైన సందర్భంలో కమిటీ నిర్ణయాన్ని సర్క్యులేషన్ పొందుటకు అధికారము కలిగియుండును. కాని ఆ విధంగా తీసుకోబడ్డ నిర్ణయం మరుసటి సమావేశములో కమిటీ అంగీకారము కొరకు ప్రతిపాదించవలెను.

9. కమిటీకి సంబంధించిన నోటీసులు, ఉత్తరములు, ప్రొసీడింగ్సు తీసుకొను అధికారము కలిగిఉండవలెను.

10. కమిటీవారిచే తనకివ్వబడిన అధికారములను అమలుజరపవలయును.

11. ప్రతి అకడమిక్ సంవత్సరమునకు ఒక నెల ముందుగానే సంస్థకు సంబంధించిన చిత్తుబడ్జెట్‌ను కమిటీ వారి మంజూరుకు ఉంచవలెను. ప్రతి ఖర్చు పద్దు బడ్జెటు అలాట్‌మెంట్‌కు లోబడి యుండవలయును.

12. కమిటీకి సంబంధించిన కోర్టు వ్యవహారములన్నియు కమిటీ తరఫున కార్యదర్శి జరుపవలయును. డాక్యుమెంట్లు వగైరాలు యావత్తును కార్యదర్శి చేవ్రాలు చేయవలయును.

**3. కోశాధిపతి అధికారములు :**

సంస్థకు సంబంధించిన యావత్తు పైకమును జమ తీసుకొనుచూ, కమిటీ వారు తీర్మానించిన బ్యాంకీలలో డిపాజిట్ చేయవలయును. కార్యదర్శి ఉత్తరువు మేరకు బ్యాంకిమీద చెక్కులు వ్రాయుచుండవలయును. ప్రతిఖర్చుకు కార్యదర్శిగారిచేత మంజూరు కాబడిన ఓచరు ఉంచవలయును.

**4 ఆడిట్ - 5 గుమాస్తా :**

కమిటీ లెక్కలు ప్రతి సంవత్సరం సర్టిఫైడ్ ఆడిటర్ చేత ఆడిట్ కాబడవలయును. కమిటీవారు ఆడిటరును వారికిచ్చు వేతనమును నిర్ణయించవలయును. గుమాస్తా.. ప్రతి విద్యార్థిని ఇచ్చు జీతమును తీసుకుని రశీదులో తానున్నూ, పాఠశాలలోని హెడ్‌మిస్ట్రస్‌నున్నూ చేవ్రాలు చేయవలయును. గుమాస్తా వసూళ్ళు చేసిన సదరు మొత్తమును ప్రతి సాయంత్రము హెడ్‌మిస్ట్రసు గారి వద్ద చెల్లించవలయును. ఆమె దానిని బ్యాంకిలో, కోశాధిపతి పేరిట జమ కట్టవలయును.

**మిసలేనియస్ :**

(ఏ) సంస్థకు హానికరములగు ఏ విషయములు గాని, సంస్థకు అవమానము కలుగజేయు ఏ ప్రకటన గాని కమిటీ గాని, సభ్యులుగాని, స్కూలు సిబ్బంది గాని ప్రచురించరాదు.

(బి) అవసర ఖర్చులకుగాను కార్యదర్శి వద్ద 50 రూపాయలు ఉంచవలయును"... ఇవీ నాటి కమిటీ నిర్ణయించుకున్న విధి విధానాలు. 1946 మే 2వ తేదిన కస్తూరిదేవి విద్యాలయం పురోభివృద్ధికి వారు తీసుకున్న నిర్ణయాలు.

అప్పట్లోనే ఆ కమిటీ నియమ నిబంధనలను ఎంత పటిష్టవంతంగా రూపొందించారో చూడండి. ఎవరెంతగా ప్రయత్నించినా ఆ ఆస్తులను కానీ, విద్యాలయం నిధులను గానీ ఎవరూ ఏవిధంగానూ చేజిక్కించుకోలేరు.. ఎవరూ దోచుకోలేరు కూడా. అంత పకడ్బందీగా కమిటీని ఏర్పాటు చేశారు. విద్యాలయం పురోభివృద్ధికైనా సరే, కమిటీ అంగీకరిస్తే తప్ప ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరగడానికి అసలు వీలే లేదు. విద్యాలయ పురోభివృద్ధికి ఏమి చేయాలో.. ఏమి చేస్తే బావుంటుందో.. నిర్ణయించేదంతా కమిటీయే తప్ప మరొక మాట లేదు. ఎందుకంటే, అప్పట్లో ఎందరో సమాజసేవా పరాయణులు, విజ్ఞులు కలసి రూపొందించిన కమిటీ నియమ నిబంధనలివి. కమిటీ అధికారాలేమిటో అందులో ఎంతో పకడ్బందీగా ఉన్నాయి. సంస్థ చక్కగా నడుచుటకు ఆ కమిటీ తన గత నిర్ణయాలను మార్చుకోవచ్చు, కొత్త అంశాలను చేర్చుకోవచ్చు కూడా. ఇదంతా ఆ కమిటీ నియమ నిబంధనల్లో స్పష్టంగా ఉన్నాయి. 'శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అంగ నిర్మాణం' అనే పేరుతో 1952వ సంవత్సరం జూన్‌లో ఆ నిర్ణయాలను (7పేజీలు) ముద్రించారు. 'నెల్లూరు శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీవారి మెమోరాండము' అనే పేరుతో అది అప్పట్లో ప్రచురితమైంది కూడా. ('లాయర్' పాఠకుల కోసం శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అంగ నిర్మాణం.. దానిలోని విషయాలను ఇక్కడ వివరంగా అందించాం). సంస్థ పురోభివృద్ధి ధ్యేయంగా చేసే కార్యకలాపాల విషయంలో కమిటీకి ఎంతటి విశేషమైన అధికారాలుంటాయో ఈ పూర్వకథనంతా ఆసాంతం మనసుపెట్టి చదివితే మనకే అర్ధమవుతుంది.

## సంస్థ పురోభివృద్ధే లక్ష్యం:

సంస్థ పురోభివృద్ధే కమిటీ లక్ష్యం. అందుకనుగుణంగా తీసుకున్న నిర్ణయాలను అమలుచేయడం కమిటీ బాధ్యత. అదే విధంగా కమిటీకి ఉన్న హక్కులు కూడా కమిటీ మెమొరాండంలో స్పష్టంగా ఉన్నాయి. సంస్థ స్థిరచరాస్తులపై కమిటీకి అధికారం ఉంటుందని, ఆ ఆస్తి కమిటీకి చెందిందని, సంస్థ పురోభివృద్ధి దృష్ట్యా కార్యకలాపాలు గావించేందుకు, సంస్థకు సంబంధించిన నిధి, ఆస్థుల సక్రమ నిర్వహణ, సమర్ధనీయమైన పరిపాలన విషయంలో కమిటీకి సర్వాధికారం ఉంటుందని కమిటీ అధికారాల్లో (ఏ-సి) పొందుపరిచారు. అంతేకాదు, సంస్థ చక్కగా నడిచేందుకు అవసరమైన బైలాలను, చట్టాలను చేసేందుకు కమిటీకి అధికారం ఉంటుందని, సంస్థ పురోభివృద్ధికి ఇవసరమైతే ఇదివరలో తాము చేసిన చట్టాలను, బైలాలను, నిబంధనలు మొదలైన వాటిని అవసరమైనప్పుడు రద్దుచేసేందుకు, లేదా తాత్కాలికంగా నిలుపుదల చేసేందుకు, లేదా వాటిలో మరికొన్నిటిని చేర్చుటకు కమిటీకి అధికారం ఉంటుందని (జి-హెచ్) స్పష్టం చేశారు.

## ఆ మహనీయుల త్యాగనిరతి ఏనాటికీ విస్మరించలేనిది :

దేశభక్తి, సమాజసేవాభావం ఉన్న నాటి మహనీయులు నిరుపేదలైన బాలికలకు విద్య బోధించడానికి ఒక విద్యాలయాన్ని స్థాపించేందుకు అప్పట్లో ఎంతగా కష్టపడ్డారో, ఎంతగా ఆలోచించి ఆ సంస్థ పురోభివృద్ధికి బాటలు వేశారో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. వారి అకుంఠిత సేవా భావానికి హ్యాట్సాఫ్ చెప్పక తప్పదు. వారి త్యాగనిరతిని మనం ఏనాటికీ విస్మరించలేం. అప్పట్లో వీరితో పాటు మరెం దరో దాతలు ఈ సంస్థ అభివృద్ధికి బాటలు వేస్తూ తమవంతు చేయూతనందించారు. ముఖ్యంగా శ్రీ కస్తూరిదేవి విద్యాలయం భవన నిర్మాణాలకు, అభివృద్ధికి అప్పట్లో దాతలు, వివిధ వర్గాల ప్రజలు అందించిన సహకారం ఏనాటికీ మరువలేనిది. ప్రముఖదాత తిక్కవరపు రామిరెడ్డిగారు అప్పట్లోనే 50వేల రూపాయలు ఈ విద్యాలయానికి విరాళంగా ఇస్తే, శ్రీయుతులు మేనకూరు బలరామరెడ్డిగారు 10వేల రూపాయలు, రేబాల కోదండరామిరెడ్డి ధర్మసంఘం తరఫున 6వేల రూపాయలు, బెజవాడ గోపాలరెడ్డిగారు 5వేల రూపాయలు, రేబాల పట్టాభిరామిరెడ్డిగారు 3వేల రూపాయలు, వేలూరు సంజీవప్పనాయుడు రూ. 2,500, మోపూరు సౌందర్యమ్మ 1000 రూపాయలు మెట్టా శేషమ్మ రూ. 900, వావిళ్ళ వెంకటశాస్త్రులు రూ. 500 ఇలా ఎందరో వదాన్యులు తమ విరాళాలిచ్చి జిల్లాలో బాలికావిద్యకు బాటలు వేశారు. ఇంకా పాఠశాలకు అవసరమైన గదుల నిర్మాణానికి కొందరు దాతలు ముందుకువస్తే, మరికొందరు తమవంతు చేయూతగా బీరువాలు, పుస్తకాలు వగైరాలు విరాళంగా ఇచ్చారు.

**(మిగతా కథ వచ్చే వారం)**

## జి.వి.కె.రెడ్డి వంటి అంతర్జాతీయ వ్యాపార దిగ్గజం

# కస్తూరిదేవి కల్యాణమండపాలపై ఆధారపడి బతకాల్నా?

- ఇంతకంటే నీచమైన ఆరోపణ ఇంకొకటి వుందా?
- మతి తప్పిన నిందలు... గతి తప్పుతున్న ఆరోపణలు

హవ్వా... ఇదేం చోద్యం, ఇదేం విడ్డూరం, ఇదేం పోరాటం? కస్తూరిదేవి విద్యాలయ కమిటిపై రోజుకో నిందేస్తున్నారు. జి.వి.కె.రెడ్డి ఇప్పటివరకు కస్తూరిదేవి విద్యాలయ అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలుపైగానే వెచ్చించారని ఓ వైపు కమిటి సభ్యులు పదేపదే చెప్తున్నా చెవికెక్కించుకోకుండా... ఆయన కస్తూరిదేవికి ఒక్క రూపాయి కూడా దానం చేయలేదని అవాకులు చవాకులు పేలుతూనే ఉండడం మూర్ఖత్వం. సామాజిక మాధ్యమాలలో అర్ధం పర్ధం లేని సమాచారాలని చేరవేస్తున్నారు.

కస్తూరిదేవి విద్యాలయ అభ్యున్నతి కోసం జి.వి.కె.రెడ్డి అనేక సందర్భాలలో తన వదాన్యతను చాటుకున్నారు. ఆ క్రమంలోనే ఆక్రమణలో వున్న మల్లెతోటలను 2001లో 70లక్షల రూపాయలు చెల్లించి ఖాళీ చేయించారు. అందుకు తగిన సాక్ష్యాలు కూడా కమిటి వద్ద ఉన్నాయి. ఇక నెలనెలా జీతాల రూపంలో 2లక్షలకు తక్కువ కాకుండా గత పది సంవత్సరాల కాలంలో పలు సందర్భాలలో సుమారు ఒకటిన్నర కోటి రూపాయలు ఇచ్చింది కూడా ఆయనే! ఇవన్నీ జి.వి.కె.రెడ్డి చేయకపోతే నందనారెడ్డి లేదా ఆమెతో గళం కలుపుతున్న 'సిరిభక్షక' కమిటి చేసిందా? అలాంటి జి.వి.కె.రెడ్డి కస్తూరిదేవి కళ్యాణ మండపాల బాడుగలు ఏడాదికి 40లక్షలు దిగమింగేస్తున్నారంటూ అసత్యపు ఆరోపణలు చేయడం ఎంతవరకూ సబబు? ఆయన సంస్థలో ఇచ్చే జీతాలలో 1శాతం కూడా వుండదు ఈ నలభై లక్షలు. నోటికి ఏదొస్తే అది మాట్లాడడం, చేతికి ఏదనిపిస్తే అది వ్రాయడం ఈ 'సిరిభక్షణ' కమిటీకే చెల్లింది.

కస్తూరిదేవి కమిటీకి ఓ ఆడిటర్ వుంటాడు. లెక్కలన్నీ పక్కాగా ఉంటాయి. ఎవరికైనా అనుమానాలుంటే ఎప్పుడైనా నివృత్తి చేసుకోవచ్చు. ఇలా అబద్దాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదు. పని కట్టుకుని ఓ వర్గాన్ని దూషిండమే ధ్యేయంగా చరిత్ర కలిగిన పెద్ద కుటుంబాలపైన బురద చల్లడమే లక్ష్యంగా నిత్యం ఆరోపణలు చేయడం హాస్యాస్పదం.

కస్తూరిదేవి విద్యాలయానికి జి.వి.కె.రెడ్డి చేసిన ఆర్ధిక సహాయం, ఆయన పలు సందర్భాలలో స్కూలును ఆదుకున్న విషయాలతో పాటు తాను కమిటి సభ్యురాలుగానే వున్నానంటూ మాగుంట పార్వతమ్మ ధీటుగానే సమాధానం చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారానే కాకుండా పత్రికా ప్రకటనల ద్వారా కూడా ఆమె ఈ విషయాలను స్పష్టం చేశారు.

పార్వతమ్మని కమిటీ నుండి తొలగించారని చెప్పేవాళ్ళు ఇప్పుడేమంటారో...?

ఇలా వ్యక్తిగత దూషణలతో బజారుకెక్కడం సిగ్గు చేటైన విషయం. ప్రపంచ స్థాయిలో వ్యాపార లావాదేవీలతో క్షణం తీరిక లేకుండా గడిపే జి.వి.కె.రెడ్డి లాంటివారు తమ వితరణ గుణంతో ఎంతో పవిత్రమైన... చరిత్రాత్మకమైన కస్తూరిదేవి విద్యాలయం పురోగతికి పూనుకోవడం ఎంతైనా అభినందనీయం! అలాంటి వదాన్యులపై లేనిపోని విమర్శలు చేస్తే ఆకాశంపై ఉమ్మినట్లే..!

# సమన్వయంతో పనులు చేసుకోండి

- వెంగళరావునగర్ ముస్లీం శ్మశాన వాటిక వద్ద ఉద్రిక్తత
- కోటంరెడ్డి జోక్యంతో సద్దుమణిగిన వివాదం
- స్థానికులతో సమన్వయంగా ముందుకు సాగాలని కాంట్రాక్టర్లకు సూచించిన ఎమ్మెల్యే



నెల్లూరు పొదలకూరురోడ్డులోని వెంగళరావునగర్ శ్మశాన వాటిక వద్ద ఈనెల 28న ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ముస్లీంలకు చెందిన శ్మశాన వాటిక వద్ద ఓ కాంట్రాక్టర్ పనులు చేస్తూ గోడను తొలగించారు. గతంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 15లక్షల సొంత నిధులతో ఈ శ్మశాన వాటికను నిర్మించివున్నారు. దీంతో ముస్లీంలు అక్కడకు చేరుకుని కాంట్రాక్టర్‌తో గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కడకు చేరుకుని కూల్చిన గోడను, బోర్ ను తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ వారికి క్షమాపణ చెప్పటంతో పాటు వాటిని తిరిగి నిర్మిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చేయాలని అలాకాకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ఏ పని చేసేటప్పుడైనా స్థానికులతో చర్చించి వారితో సమన్వయం చేసుకుని పనులు విషయంలో ముందుకు పోవాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌హెల్త్ మరియు నగర కార్పొరేషన్ మధ్య సమన్వయం లోపించడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు.

# నిప్పుకు... సుజనా తుప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఈయనను మరో విజయమాల్యాగా అభివర్ణిస్తున్నారు. కాని విజయ్‌మాల్యాతో సుజనాను పోల్చలేం. విజయ్‌మాల్యా దొంగ కంపెనీలు సృష్టించి బ్యాంకులను బురిడీ కొట్టించలేదు. వ్యాపార సంస్థల మీదే అప్పులు తీసుకున్నాడు. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లో తీవ్రంగా నష్టపోయి, అప్పులపాలై విదేశాలకు పారిపోయాడు. కాని, సుజనాచౌదరి ఉద్దేశ్యపూర్వకంగానే నకిలీ కంపెనీలను సృష్టించి వాటి పేరు మీదే వేలకోట్లు బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్నారు. ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసినదే! బ్యాంకులు నుండి తెచ్చిన అప్పుల తోనే తెలుగుదేశం ప్రతిపక్షంలో వుండగా బ్రతికించుకుంటూ వచ్చారు. ఈ డబ్బుల ఖర్చు వల్లే సుజనాచౌదరికి రాజ్యసభ రావడం అయినా కేంద్రంలో మంత్రి కావడం అయినా!

2014లో నరేంద్ర మోడీ తొలి కేబినెట్‌లోనే అశోక్ గజపతిరాజుతో పాటు సుజనాచౌదరి పేరును కూడా చంద్రబాబు ఇచ్చారు. అయితే నరేంద్ర మోడీ సుజనా చౌదరి బ్యాంకులకు కట్టాల్సిన బకాయిల లిస్టు ఫైలును బాబు ముందుపెట్టారు. దాంతో సుజనాకు తొలివిడతలో బ్రేకు పడింది. బ్యాంకు వడ్డీ బకాయిలు చెల్లించాకే ఆయనను రెండో విడతలో మంత్రి వర్గంలో చేర్చుకున్నారు. ఇటీవల కాలంలో ఈడి దొంగ కంపెనీలపై దాడులు పెంచింది. ఆయా సంస్థలు నిర్వహిస్తున్న డొల్ల కంపెనీలు గుట్టలు గుట్టలుగా బయటపడుతున్నాయి. దేశంలోని పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు డొల్ల కంపెనీల ద్వారానే వందలు, వేల కోట్లు అప్పులు తీసుకుని వున్నట్లు కేంద్రం గుర్తించింది. ఆ డొల్ల కంపెనీల భరతం పట్టేందుకే ఈడి దాడులు ముమ్మరం చేసింది. సుజనాచౌదరి కంపెనీలపై ఆ కోణంలోనే ఈడి దాడులు జరిగాయి.

ఐటి, సిబిఐ, ఈడి... ఇటీవల కాలంలో రాష్ట్రంలోని టిడిపి పెద్దతలకాయలపై వరుస దాడులు జరిగాయి. ఈ దాడులతోనే చంద్రబాబు వెనుక ఎంత పెద్ద అవినీతి ముఠా ఉందో అర్ధమవుతోంది. తన ముఠాపై కేంద్రం దాడులు ముమ్మరమయ్యే సరికే... కేంద్రం లాగిన తీగ తన డొంకను ఎక్కడ కదిలిస్తుందోననే భయంతో చంద్రబాబు మోడీపై యుద్ధమంటూ అన్ని పార్టీల ఆఫీసుల తలుపులు తడుతున్నాడు.

గత ఆరేళ్ళుగా జగన్‌ను ఈ తెలుగు దేశం నాయకులు అదే పనిగా ఆడిపోసుకుంటున్నారు. గోరంతను కొండంతలుగా ప్రచారం చేశారు. కాని, జగన్ అన్నింటిని కూడా చట్టపరిధిలోనే ఎదుర్కొన్నాడు. జగన్‌పై లక్షకోట్లు అని చేసిన ఆరోపణలన్నీ కూడా ఒక్కొక్కటిగా తేలిపోయాయి. లక్ష పోయి వేలు, వేలు పోయి వందల కోట్లలోకి వచ్చింది. రేపు ఆ కేసు కూడా నిలుస్తుందన్న నమ్మకం లేదు.

జగన్‌పై అక్రమాస్తుల కేసులు ఒక్కొక్కటిగా వీగిపోయే కొద్ది చంద్రబాబు తెర వెనుక వున్నోళ్ళు ఒక్కొక్కరుగా బయట కొస్తున్నారు. అవినీతి కేసుల్లో చిక్కుకుంటున్నారు. అందుకే జగన్ మొదట నుండి అంటున్నాడు... అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడని. ఇప్పుడు ఆ దేవుడే అన్ని నిజాలను బయటపెట్టిస్తున్నాడు.

# డైవర్షన్ అంకుల్స్

(మొదటి పేజీ తరువాయి)

అభిమానాలుగాని, మద్దతుదారులు గాని ఓట్లేయరు. ఆ ఓట్లు ఈసారి జగన్‌కు పడే అవకాశముంది. అలా పడితే చంద్రబాబుకి తీరని నష్టం. అందుకే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను జగన్‌కు పోకుండా తన వైపుకు మళ్లించుకోడానికే పవన్ జనసేన ద్వారా సొంతంగా పోటీ చేసేదానికి సిద్ధమవుతున్నాడు. ఈ పవన్ చంద్రబాబు పంజరంలోని చిలుకేనని ముందునుండే అంచనా వుంది. బాబు డైరక్షన్‌లోనే ఈ చిలుక మాట్లాడుతోంది. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు, విమర్శలు అన్నీ కూడా ఆయన వ్రాసిచ్చిన స్క్రిప్ట్‌లో భాగమే! ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా, చంద్రబాబు చేస్తున్న రాజ్యాంగ, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను ప్రశ్నించకుండా మాటికి మాటికి జగన్‌పై విమర్శలు చేస్తున్నప్పుడే ఈ పవన్, బాబు ఏజెంట్ అన్నది అర్ధమైంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి మరో నాయకుడు కొత్తగా పుట్టుకొచ్చాడు. ఆయనే జె.డి. లక్ష్మీనారాయణ. ఒకప్పుడు లోక్‌సత్తా పార్టీని పెట్టి ఆ పార్టీ నడిపే సత్తా లేక రాజకీయాల నుండే తప్పుకున్న జయప్రకాశ్ నారాయణ వారసుడిగా నేను వచ్చానంటున్నాడీయన. లోక్‌సత్తాను అద్దెకు తీసుకోవాలనికొని, ఆ ప్రయత్నం మానుకున్నాడు. జనసేనతో పాటు లక్ష్మీనారాయణ ద్వారా కూడా కొన్ని ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను డైవర్ట్ చేసే పన్నాగం ఇది. ఇక వీటికి సిపిఎం, సిపిఐ వంటి పార్టీలు కూడా తమవంతు తోడ్పాటునందించడానికి సిద్ధంగా వున్నాయి. మొత్తానికి ఈ డైవర్షన్ అంకుల్స్ తుది టార్గెట్ జగన్‌ను అడ్డుకోవడమే!




# కూటమికి ఓటమేనా?

## • టీడీపీ పొత్తు కాంగ్రెస్‌ను ముంచుతుందా?



*సిగ్గు, శరం, నీతి, విలువలు లేని రాజకీయ దృశ్యం ఒకటి ఈ నెల 28వ తేదీన ఆవిష్కృతమైంది. తెలంగాణ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఈ ముదనష్టపు నీతిబాహ్య దృశ్యాన్ని చూసే అవకాశం ప్రజలకు కలిగింది.*

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగువాడి ఆత్మగౌరవం, తెలుగువాడి పౌరుషంకు ప్రతిరూపంగా పుట్టిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఒకే వేదికను పంచుకున్నారు. మూడున్నర దశాబ్దాల తెలుగుదేశం రాజకీయ చరిత్రలో ఇంతకంటే ఇంకో దరిద్రం ఉండదేమో? మన పురాణాలు, విశ్వాసాల ప్రకారం ఆత్మలు ఉండడం నిజమే అయితే, ఎన్టీఆర్ ఆత్మ ఖచ్చితంగా ఈ దృశ్యాన్ని చూసి ఆత్మహత్య చేసుకునేదేమో?

చంద్రబాబు ఎందువల్లనో కాంగ్రెస్‌కు బాగా బెండైపోయాడు. ఎంతగా బెండైపోయాడంటే... బుధవారం నాడు రాహుల్‌తో కలిసి పాల్గొన్న ఖమ్మం సభలో... ఒక టిడిపి కార్యకర్త ఆయనకు తెలుగుదేశం కండువాను కప్పబోతే వద్దని పంపించాడు. వెను వెంటనే కాంగ్రెస్ కార్యకర్త ఒకరు కాంగ్రెస్ కండువాను కప్పితే ఎంతో ఆనందంగా కప్పించుకున్నాడు. రాజకీయ జన్మనిచ్చిన కాంగ్రెస్‌పై ఆయనకు ఇంకా ఎంత ప్రేమవుందన్నది ఈ సంఘటనతోనే వ్యక్తమవుతోంది. 2019 ఎన్నికలలో ఆంధ్రాలో తెలుగుదేశం ఓడిపోతే, ఆయన పార్టీని తీసుకెళ్లి కాంగ్రెస్‌లో విలీనం చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

ఆత్మగౌరవం, ఆత్మపౌరుషం వంటివి వదిలేసి చంద్రబాబు కాంగ్రెస్‌తో వూరేగుతున్నాడు. కాంగ్రెస్ వాళ్ళకు కూడా తెలుగుదేశం వూహించని మిత్రపక్షం. కాబట్టి రాహుల్ చంద్రబాబుకు పెద్ద పీట వేస్తున్నాడు. తెలంగాణ ప్రచార సభల్లో రాహుల్ నోట చంద్రబాబు మాటలే వచ్చాయి. హైదరాబాద్‌ను కట్టింది, ఛార్మినార్‌కు రాళ్లెత్తింది, హుస్సేన్‌సాగర్ చెరువుకు మట్టి మోసింది, అసెంబ్లీ భవనాలకు సున్నం పూసింది, గోల్కొండకు తాపీ మేస్త్రి పని చేసింది కూడా చంద్రబాబేనన్నట్లుగా రాహుల్ ప్రసంగం సాగింది.

సరే, వీళ్లిద్దరూ కలవడం వరకు బాగానే వుంది. మరి వీళ్ళలాగే కార్యకర్తలూ కలవగలరా? వీరి కలయికను తెలంగాణ ప్రజలు ఆమోదించగలరా? అసలు తెలుగుదేశంతో పొత్తు కాంగ్రెస్‌కు కలిసొస్తుందా?

తెలంగాణలో తెలుగుదేశంకు కేడర్ వుందని, ఒక్కో నియోజకవర్గంలో రెండువేల నుండి 20వేల ఓట్లు దాకా వుంటాయని, ఆ ఓట్లన్నీ తమకు కలిసొస్తాయని కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. కాని, తెలంగాణలో తెలుగుదేశం కేడర్ ఐదేళ్లుగా క్షీణిస్తోంది. 2014లో టిఆర్ఎస్ అధికారంలోకి రావడంతో అక్కడ తెలుగుదేశం, వైసిపిల పతనం ప్రారంభమైంది. ఈ రెండు పార్టీలపైన కూడా ముందు ఆంధ్రా పార్టీలనే ముద్ర పడిపోయింది. 2014లో ఈ రెండు పార్టీల తరపున గెలిచినవాళ్లు కూడా ఎక్కువమంది టిఆర్ఎస్‌లోకి, కొద్దిమంది కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. వారితో పాటు కేడర్ కూడా వెళ్లిపోయింది. తెలంగాణలో ఇక ఆంధ్రా పార్టీలకు మనుగడ లేదన్నది గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలోనే తేలిపోయింది. గ్రేటర్‌లో తెలుగుదేశంకు ఒకే ఒక్క కార్పొరేటర్ సీటు రావడం చూసాం. 2014 ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఒక్క అసెంబ్లీ సీటును కూడా గెలవని టిఆర్ఎస్ గ్రేటర్ ఎన్నికల్లో మాత్రం ఏకంగా 99 డివిజన్‌లను గెలుచుకుంది. అంటే గ్రేటర్ సిటీలోని సెటిలర్స్ అంతా కూడా టిఆర్ఎస్ వైపు వెళ్లిపోయారు. అప్పటికి రేపటి ఎన్నికలకు పెద్ద మార్పుండదు. హైదరాబాద్‌లోను, మిగతా తెలంగాణ జిల్లాల్లోనూ కమ్మ సామాజిక వర్గం వారు తప్పితే మిగతా వర్గాలవాళ్ళు అటు టిఆర్ఎస్‌కో ఇటు కాంగ్రెస్‌కో వెళ్లిపోయారు.

కాబట్టి తెలుగుదేశంతో పొత్తువల్ల కాంగ్రెస్‌కు వచ్చే ప్రయోజనం ఏమీ లేదు. పొత్తులో భాగంగా టిడిపికి 14సీట్లిచ్చారు. వాటిలో వాళ్ళు నాలుగు గెలిస్తే గొప్ప. కాంగ్రెస్ అనవసరంగా సీట్లు పోగొట్టుకున్నట్లే! దీనికితోడు ఆంధ్ర పార్టీయైన టిడిపితో కాంగ్రెస్ జట్టు కట్టడంపై తెలంగాణ ప్రజల్లో వ్యతిరేకత తెచ్చింది. దీనికితోడు మహాకూటమి అధికారంలోకి వస్తే తెలుగుదేశంకు సాగునీటి శాఖ మంత్రి పదవి పోతుందని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుండి మనకు రావాల్సిన నీళ్లను చంద్రబాబు అడ్డుకుంటాడని టిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం కూడా ప్రభావం చూపిస్తుంది. టిడిపితో పొత్తు లేకుంటే తెలంగాణ ఇచ్చిన పార్టీగానన్నా కాంగ్రెస్‌పై సానుభూతి వుండేది. తెలుగుదేశంతో చేరి అక్కడ కాంగ్రెస్ కూడా చెడిపోయింది.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com